RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 167 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి బుధవారం 17-6-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠ మాసం, తిథి॥ తదియ రా॥2.09, పునర్వసు సా॥6.00, వర్జ్యం ఉ॥6.46 - 8.15, దుర్ముహూర్తం ఉ॥ 11.31-12.23, శుభ సమయం ఉ॥ 10.30-12.00, రాహుకాలం మ॥12.00-1.30, సూర్యోదయం ఉ॥ 5.28, సూర్యాస్తమయం సా॥ 6.27 గం॥

## దుర్గమ్మకు అగ్గిపెట్టెలో పట్టే చీర బహూకరణ

ఇంద్రకీలాద్రిపై రూ.82 కోట్లతో విస్తరణ పనులు



**విజయవాడ, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మకు.. సిరిసిల్లకు చెందిన చేనేత కార్మికుడు నల్ల విజయ్‌కుమార్ మిగతా 2లో..



# అద్భుత నగరంగా అమరావతి నిర్మాణం

- అంతర్జాతీయ మౌలిక వసతులతో తీర్చిదిద్దుతున్నాం
- పీపుల్ ఫస్ట్ మా విధానంలో నాలెడ్జ్ సిటీగా చేస్తున్నాం
- జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థల ఏర్పాటు
- క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫాస్ట్రక్చర్ ప్రత్యేక ఆకర్షణలు
- లీడర్‌షిప్ ప్లీనరీ-2లో సీఎం చంద్రబాబు ప్రసంగం

**అమరావతి, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పీపుల్ ఫస్ట్ మా విధానమని... ఈక్విటీ, నేచర్, ఆపర్చునిటీ, లివబుల్ సిటీగా అమరావతి ఉంటుందని సీఎం చంద్రబాబు తెలిపారు. అంతర్జాతీయ మౌలిక వసతులతో, అవకాశాల వేదికగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామన్నారు. సింగపూర్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండో రోజు పర్యటన కొనసాగుతోంది. 'వరల్డ్ సిటీస్ సమ్మిట్'లో పాల్గొన్న సీఎం.. లీడర్‌షిప్ ప్లీనరీ-2లో 'కెన్ స్మార్ట్ సిటీస్ లవ్ హ్యూమన్స్' అనే అంశంపై మిగతా 2లో..

## ఎపి అభివృద్ధికి ఇతోధికంగా చేయూత

వాజ్‌పేయ్ పార్కులో స్వచ్ఛభారత్‌లో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి




**విజయవాడ, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. ఒక రోజు పర్యటనలో భాగంగా విజయవాడ చేరుకున్న ఆయన.. నగరంలోని వాజ్‌పేయీ పార్కులో స్వచ్ఛభారత్‌లో భాగంగా చీపురు పట్టి చెత్త ఊడ్చారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యే సుజనా చౌదరితో కలిసి పార్కులో మొక్కలు నాటారు. అనంతరం పార్క్‌కు వచ్చిన వాకర్స్‌తో ముచ్చటించారు. దేశంలో అత్యధిక కాలం సేవలందించిన ప్రధానిగా.. నరేంద్ర మోదీ చరిత్రలో నిలిచిపోయారన్నారు.

2014కు ముందు భారత ఆర్థిక వ్యవస్థ అత్యంత క్షీణ దశలో ఉందని.. మోదీ ప్రధాని అయ్యాక అత్యంత వేగంగా అభివృద్ధి చెందే ఆర్థిక వ్యవస్థగా భారత్ రూపాంతరం చెందిందని పేర్కొన్నారు. రైల్వే ఎలక్ట్రిఫికేషన్ జరిగిన రెండో దేశం భారత్ అని వివరించారు. ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు 8 రెట్లు పెరిగాయి. అమరావతి కోసం హడ్కో నుంచీ రూ.11వేల కోట్లు ఇచ్చామన్న జోషి.. అమరావతి కనెక్ట్ చేస్తూ ప్రత్యేక రైల్వే లైన్ కోసం నిధులు సమకూర్చినట్లు గుర్తుచేశారు. రాష్ట్ర అబివృద్ధి కోసం చంద్రబాబు, పవన్, మాధవ్ కలిసి బాగా పని చేస్తున్నారని ప్రహ్లాద్ జోషి కితాబిచ్చారు. రాజధాని అమరావతికి రోడ్, రైల్వే కనెక్టివిటీ పెంచుతున్నామని వెల్లడించారు. అమరావతి అభివృద్ధికి కేంద్రం నుంచి పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నట్టు చెప్పారు.

## నీట్ రీ ఎగ్జామ్‌తో అప్రమత్తం

టెలిగ్రామ్ యాప్‌పై కేంద్రం ఆంక్షలు




**న్యూఢిల్లీ, జూన్ 16 (ఆర్ఎన్ఎ):** నీట్ 2026 రీ-ఎగ్జామినేషన్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పరీక్షను సురక్షితంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు టెలిగ్రామ్ యాప్ యాక్సెస్‌పై తాత్కాలిక ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. ఐటీ చట్టం సెక్షన్ 69ం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. జూన్ 22 వరకు భారతదేశంలో టెలిగ్రామ్ యాప్ యాక్సెస్‌పై నియంత్రణ ఉండనుంది. ఈనెల 21న దేశవ్యాప్తంగా నీట్ 2026 రీ-ఎగ్జామ్ నిర్వహించనున్న నేపథ్యంలో, పరీక్ష భద్రతను దృష్టిలో ఉంచుకుని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సిఫార్సు మేరకు కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే, మిగతా 2లో..

## 'ఆయనో పెద్ద జోక్'..

కాంగ్రెస్- డీఎంకేల మధ్య ముదిరిన వైరం





**చెన్నై, జూన్ 16 (ఆర్ఎన్ఎ):** కాంగ్రెస్-తమిళనాడు డీఎంకే ల మధ్య వైరం రోజురోజుకి పెరుగుతోంది. తాజాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై డీఎంకే ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఆయన పెద్ద జోక్ అంటూ ఎగతాళి చేసింది. ప్రతిపక్ష పార్టీల మధ్య ఐక్యతను రాహుల్ బలహీనపరుస్తున్నారంటూ విమర్శలు గుప్పించింది. తమిళనాడు శాసనసభ ఎన్నికల్లో ఐదు సీట్లు నెగ్గిన కాంగ్రెస్.. విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం(టీవీకే)కు మద్దతు తెలిపిన సంగతి తెలిసిందే. దీన్ని డీఎంకే వెన్నుపోటుగా అభివర్ణించింది. దీంతో ఆ పార్టీతో పొత్తును రద్దు చేసుకుంది. ఈ విషయంపై డీఎంకే ఐటీ విభాగం ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టింది. 'కాంగ్రెస్ రాజకీయ ఉనికి కోసం పోరాడుతుండగా.. మేం వారిని మా భుజాలపై మోశాం. కానీ.. ఒక కొత్త బొమ్మ రాగానే వారు మాకు హ్యాండ్ ఇచ్చి వెళ్లిపోయారు' అని రాసుకొచ్చింది. ఈసందర్భంగా రాహుల్‌ను ఒక పెద్ద జోక్‌గా అభివర్ణించింది. ఇదే సమయంలో డీఎంకే అధికారిక పత్రిక మురసోలి తన సంపాదకీయంలో రాహుల్‌పై విమర్శలు గుప్పించింది. ప్రతిపక్ష పార్టీల మధ్య విభేదాలు తలెత్తడానికి ఆ కాంగ్రెస్ నాయకుడే కారణమని ఆరోపించింది. ఇండియా కూటమి సమావేశంలో రాహుల్ చేసిన వ్యాఖ్యలను తప్పుబట్టింది. 'ఐక్యత గురించి రాహుల్ తెగ ఉపన్యాసాలు మిగతా 2లో..

## హోంమంత్రి అనితపై గుడివాడ కామెంట్స్

- దిగజారిపోయి మహిళలపై విమర్శలు సరికాదు
- ఇది యావత్తు మహిళా లోకానికే అవమానం
- అమర్‌నాథ్ వ్యాఖ్యలపై మండిపడ్డ డిప్యూటీ సిఎం



**అమరావతి, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాజకీయాల్లో విమర్శలు విధానపరంగానే ఉండాలని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి అనితపై ఓ మాజీ మంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మహిళల కట్టూబొట్టుపై కామెంట్స్ చేసే స్థాయికి ఆ నాయకుడి పార్టీవారు దిగజారిపోయారంటూ వ్యాఖ్యానించారు. స్త్రీల గురించి మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఆ వ్యాఖ్యలు కేవలం హోం మంత్రిని అన్నట్టే కాదని.. మిగతా 2లో..

## సీబీఎన్ ఎట్ 361 డిగ్రీస్.. పాలీమ్యాథ్ పుస్తకం

సింగపూర్‌లో ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు



**అమరావతి, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సీబీఎన్ 361 డిగ్రీస్.. పాలీమ్యాథ్ పుస్తకాన్ని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్‌లో ఆవిష్కరించారు. కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. పుస్తకం తొలి ప్రతులను సింగపూర్‌లోని భారత హైకమిషనర్ శిల్పక్ అంబులే, మంత్రి పి.నారాయణ, కాకతీయ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులకు అందించారు. ఈ పుస్తకాన్ని 'రేపటి కోసం' దినపత్రిక చీఫ్ ఎడిటర్ శాఖమూరు శ్రీనివాస ప్రసాద్ రచించారు. దీనిని విశ్రాంత ఐఏఎస్ అధికారి కేవీ సత్యనారాయణ ఆంగ్లంలో అనువదించారు. దార్శనిక నేతగా ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ సందర్భాల్లో తీసుకున్న నిర్ణయాలను విశ్లేషిస్తూ ఈ పుస్తకాన్ని రచించారు. ప్రపంచంలోనే అత్యుత్తమ పాలకులుగా గుర్తింపు ఉన్న సింగపూర్, న్యూజిల్యాండ్ మాజీ ప్రధానులు లీ క్వాన్ యూ, జేసిండా ఆర్డ్నాడ్ లాంటి అంతర్జాతీయ దిగ్గజ నేతల తరహాలోనే సీఎం చంద్రబాబు నిర్ణయాలు తీసుకొంటున్నారని.. ఏపీ అభివృద్ధికి విజన్‌ల రూపకల్పనతో పాటు అమరావతి రాజధాని నిర్మాణంలో తీసుకుంటోన్న శ్రద్ధ దీనికి ప్రత్యక్ష ఉదాహరణ అని రచయిత వివరించారు. ఏపీ రెరా మాజీ చైర్మన్ రామనాథ్ వివిధ సందర్భాల్లో వ్యక్తపరిచిన అభిప్రాయాల్లో బాహ్య ప్రపంచానికి తెలియని అంశాలను సీబీఎన్అ361 డిగ్రీస్ పుస్తకంలో ఆవిష్కరించినట్టు తెలిపారు.

సింగపూర్ ప్రభుత్వ గుర్తింపు పొందిన కాకతీయ కల్చరల్ అసోసియేషన్.. ముఖ్యమంత్రిని గ్లోబల్ పాలీమ్యాథ్ అవార్డుతో సత్కరించింది. సింగపూర్ రూపకర్త లీ క్వాన్ యూ శతజయంతిని పురస్కరించుకుని విడుదల చేసిన వెండి నాణెళిన్ని సీఎం చంద్రబాబుకు అసోసియేషన్ ప్రతినిధులు బహూకరించారు. త్వరలోనే ఈ పుస్తకం తెలుగు, హిందీ సహా వివిధ భారతీయ భాషల్లో విడుదల చేయనున్నట్టు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెరా మాజీ చైర్మన్ రామనాథ్, కేవీ సత్యనారాయణ, శంకర ప్రసాద్, సింగపూర్‌లోని తెలుగు ప్రముఖులు పాల్గొన్నారు.

## అమర్‌నాథ్ వ్యాఖ్యలపై సరైన సమయంలో సమాధానం చెప్తా

హోంమంత్రి అనిత



**అమరావతి, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** గుడివాడ అమర్‌నాథ్ వ్యాఖ్యలపై హోంమంత్రి అనిత స్పందించారు. రాజకీయ ముసుగు వేసుకొని మహిళల్ని కించపరిచేలా మాట్లాడుతున్న వారికి మరో వేదికపై సమాధానం చెబుతానన్నారు. పోలీసుశాఖ పనితీరుపై మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడారు. "నా డిపార్ట్‌మెంట్ పనితీరును ప్రశంసించుకునే సమయంలో మిగతా 2లో..

## మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన స్టార్ క్రికెటర్ జాంటీ రోడ్స్



**అమరావతి, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** : ఏపీ మంత్రి నారా లోకేశ్ ను స్టార్ క్రికెటర్ జాంటీ రోడ్స్ కలిశారు. క్రీడలు, యువజన అభివృద్ధి, క్రీడారంగంలో ఆవిష్కరణలపై చర్చించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా లోకేశ్ వెల్లడించారు. "అంతర్జాతీయ ఉత్తమ పద్ధతులు అవలంబించడం, రాబోయే తరం ఛాంపియన్లను తీర్చిదిద్దడంపై ఇద్దరం చర్చించాం. ఏపీని ప్రపంచస్థాయి క్రీడా హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రపంచవ్యాప్త క్రీడాకారుల్లో జాంటీ రోడ్స్ స్ఫూర్తి నింపారు. ఆయన్ను కలవడం ఎంతో సంతోషాన్నిచ్చింది" అని లోకేశ్ పేర్కొన్నారు.

తనను తాను చిన్నబుచ్చుకోవడం, ఇతర బలహీనతల కంటే పెద్ద పాపం. తనను తాను ద్వేషించుకోవడం మొదలుపెట్టిన వ్యక్తి పతన ద్వారం తెరవబడే ఉంది.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ఎరువులు, విత్తనాలపై భరోసా ఏదీ ?

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నైరుతి ప్రవేశించినా ఇప్పటికీ ఆశించిన వర్షాలు పడడం లేదు. రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతున్నా, అప్పుడే తొందరపడవద్దని, విత్తనాలు వేసుకోవద్దని వ్యవసాయాధికారులు హెచ్చరి స్తున్నారు. మరోవైపు సన్నరకాలను, డిమాండ్ ఉన్న వంగడాలనే వేయాలని తెలంగాణ ప్రభుత్వం తాజాగా సూచించింది. నిజానికి ఏ పంటలు వేయాలో రైతులకు సూచించి, అందుకు అనుగుణంగా ఎరువులు, విత్తనాలను సరఫరా చేసే విధానం అవంబించి ఉంటే ఇవాళ వ్యవసాయ సంక్షోభం ఉండేది కాదు. ఏ భూములు ఏ పంటలకు అనువో ఇన్నేళ్లయినా గుర్తించి, రైతులను వ్యవసాయానికి అనుగుణంగా సన్నదం చేయడంలో తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయి. మరోవైపు ఎల్‌నినో భయ పెడుతున్న వేళ రైతులకు తగిన సూచనలు, సలహాలు చేయడం లేదు. ప్రణాళికలు సిద్ధం చేయడం లేదు. అందుకే ప్రభుత్వ నిర్లక్ష్యానికి ఏటా రైతులు బలవుతున్నారు. నీటి లభ్యత, భూముల వివరాల ఆధారంగా పంటలు పండించే పద్దతి కానరావడం లేదు. రైతులు కూడా తమకు తెలిసిన వరిని పండిస్తున్నారు. డిమాండ్ ఉన్న పంటలు పండించి, ఆర్థికంగా ఎదగడం లేదు. కాగా ఈ ఏడాది సాధారణ వర్షపాతం కంటే తక్కువ నమోదవుతుందని ఐఎండి. అంచనా వేసింది. ఎల్‌నినో రాష్ట్రంపై ప్రభావం చూపుతుందని రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు వెల్లడించాయి. అందుకు తగ్గ ప్రణాళికలతో సన్నద్ధం కావాలని ఆదేశించినా., అదేమిటో రైతులకు బోధపడడం లేదు. రాష్ట్రంలో అత్యధికంగా వ్యవసాయం సాగేది ఖరీఫ్‌లోనే. నిరుడు పంటల సరళిలో మార్పులు చోటు చేసుకున్నప్పటికీ మొత్తంగా విస్తీర్ణ పరంగా సాధారణ సాగు నమోదైంది. అయితే వర్షాభావం, అకాల, భారీ వర్షాలు, తుపాన్లతో పంట నష్టాలు సంభవించి అన్నదాతలను ఆర్థికంగా నష్టపరిచాయి. కీలక సమయంలో వర్షాల్లేక కొన్ని ప్రాంతాల్లో పంట నష్టం వాటిల్లింది. ఖరీఫ్‌లో డ్రై స్పెల్ వందల మండలాలల్లో తిష్ట వేసినా ప్రభుత్వం కేవలం పెద్దగా పట్టించుకోలేదు. ఎపిలో రబీలో దుర్భిక్ష పరిస్థితులు విస్తరించగా 51మండలాల్లో కరువును ప్రకటించి చేతులు దులుపుకుంది. ప్రకటించిన మండలాల్లో కూడా రైతులకు ఎలాంటి ప్రత్యేక సహాయమూ చేయలేదు. ఇంకో వైపు ఖరీఫ్, రబీ రెండు సీజన్లలో రైతులకు ఏ పంటకూ ధర రాక, ధర ఇప్పించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టక రైతులు నష్టాలను చవిచూశారు. కేంద్రం కూడా ఒక పద్ధతి ప్రకటించడం లేదు. ఎల్‌నినోతో ఏ పంటలు వేసుకోవాలో, దేనికి మద్దతు ఇస్తరో తెలియడం లేదు. తెలంగాణలో మక్కజొన్న, జొన్న పంటలు వేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాటికి గిట్టుబాటు ధరలు లేక తల్లడిల్లారు. పంటలు కొనుగోలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యింది. ఖరీఫ్ ముంచుకొస్తున్నా, నేటికీ సక్రమంగా ధాన్యం సేకరణ జరగలేదు. ఇకపోతే ఈఖరీఫ్‌లో సేద్యానికి రైతులకు అత్యవసరంగా కావాల్సినవి నాణ్యమైన విత్తనాలు,ఎరువులు, క్రిమిసంహారక మందులు, పెట్టుబడులు. రైతులకు అవసరమైన మొత్తం విత్తనాల్లో ప్రభుత్వం రాయితీపై అందించేవి 30 శాతమే. అవీ కొన్ని పంటలకే పరిమితం. ఎపిలో వేరుశనగ విత్తనాల పంపిణీ ఏర్పాట్లు ఆలస్యమయ్యాయి. వరి, కందులు, ఇతర అపరాలూ అంతే. పచ్చిరొట్ట పంట విత్తనాలిస్తున్నామంటున్నా బహిరంగ మార్కెట్ ధరలే రాయితీ విత్తనాలకూ నిర్ణయించారు. రాయితీ విత్తనాల పంపిణీ యావత్తూ అదే తీరు. సీజన్ ప్రారంభానికి ముందు నుంచీ కేంద్రం ఆదేశాలతో యూరియా, డిఎపి వాడకాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రత్యేక యాప్‌లని, కార్డులని, పైలెట్ ప్రాజెక్టులని ప్రహసనం లేవనెత్తి రైతుల్లో, ముఖ్యంగా కౌలు రైతుల్లో గుబులు రేపింది. నిరుడు ప్రభుత్వ ముందుచూపు లేక యూరియా దొరక్క రైతులు ఇబ్బంది పడగా, ఆ పరిస్థితులే ఇం కా కొనసాగుతున్నాయి. నకిలీ, కల్తీ, అనుమతుల్లేని పత్తి విత్తనాల బెడద ఉండనే ఉంది. కేంద్రం పెంచిన డీజిల్, పెట్రోలు ధరలు, ఎరువుల ధరలు రైతాంగాన్ని కుంగదీస్తున్నాయి. తొలకరి సంకేతాలతో రైతన్నలు సాగుకు సిద్ధమయ్యేందుకు కావాల్సిన పెట్టుబడులు సమకూర్చడంపై ప్రభుత్వంలో నెలకొన్న స్తబ్దత ఆందోళన కలిగిస్తుంది. ఎపిలో కౌలు రైతులకు రెండేళ్లల్లో ఒక్క రూపాయి ఇవ్వలేదు. ఈసారైనా ఇస్తారో లేదో తెలీదు. కౌలు రైతులకు గుర్తింపు కార్డుల ఊసే లేదు. నిరుడు అక్టోబర్‌లో మొంథా తుపాన్ రాగా నేటికీ రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వలేదు. పంటల బీమా సొమ్ము లేదు. కరువు మండలాల్లో రైతులకు పరిహారం లేదు. రెండేళ్లల్లో రైతులకు సున్నా వడ్డీ రూపాయి కూడా విడుదల చేయలేదు. వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యాలు పుస్తకాలకే పరిమితం అయ్యింది. ప్రాజెక్టుల కింద నీటి విడుదలకు షెడ్యూల్ ఇచ్చినా ఎల్‌నినో, వర్షాభావాలను పరిగణనలోకి తీసుకోవాలి. సేద్యం సజావుగా సాగాలంటే రైతుల అవసరాలన్నింటినీ తీర్చేందుకు ప్రభుత్వంలో చిత్తశుద్ధి, ముందుచూపు, సన్నద్ధత అవసరం. ఇకపోతే తెలంగాణలో ప్రభుత్వం తీరు సక్రమంగా కనిపించడం లేదు. దేశీయంగానే కాకుండా అంతర్జాతీయ మార్కెట్‌లోనూ డిమాండ్ ఉన్న 8 రకాల మేలైన వరి వంగడాలనే సాగు చేసేలా రైతులను ప్రభుత్వం ప్రోత్సహించాలని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, శాస్త్రవేత్తలు సూచించారు. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా అవగాహన సదస్సులను నిర్వహించాలన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ సబ్‌కమిటీ ఎనిమిది రకాల వంగడాలను సాగు చేయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు మంత్రులకు సూచించారు. ఈ వంగడాలకు మార్కెట్‌లో ఉన్న డిమాండ్ వల్ల ప్రభుత్వ మద్దతు ధర కంటే చాలా ఎక్కువ ధర లభించే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూర్‌పలలో ఈ బియ్యానికి విపరీతమైన ఆదరణ ఉందని, వీటికి విత్తనాల కొరత కూడా లేదని వివరించారు. అంతర్జాతీయ మార్కెట్ ధరల్లో వచ్చే ఒడిదొడుకుల నుంచి రైతులకు రక్షణ లభించాలన్నా ఈ 8 రకాల సాగు ఒక్కటే మార్గమని తెలిపారు. రాష్ట్రంలో సాగవుతున్న అన్నిరకాల సన్న బియ్యానికి మార్కెట్‌లో ఆదరణ లభించడం లేదని, కొన్నిరకాల ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్నప్పుడు నూకలు ఎక్కువగా వస్తున్నాయని పౌర సరఫరాల శాఖ అధికారులు మంత్రులకు వివరించారు. డిమాండ్ లేని రకాల సాగును క్రమంగా తగ్గించి, ఎగుమతులకు ఉపయోగపడే నిర్దిష్ట రకాలనే ప్రోత్సహించాలని అభిప్రాయపడ్డారు. అయితే ఇది క్షేత్రస్థాయిలో రైతులకు చేరాలి. వారికి సక్రమంగా విత్తనాలు సరఫరాచేసి, అవే పంటలు పండించేలా ప్రోత్సహించేందుకు నడుం బిగించాలి. అప్పుడే సత్ఫలితాలు సాధించగలం.

# సింగపూర్‌తో ఎపికి మంచి సంబంధాలు

**మూడు దశాబ్దాలుగా కలసి పసనిచేస్తున్నాం**

**పార్ట్‌నర్‌షిప్ సన్నాహక సమ్మిట్‌లో చంద్రబాబు**

**అమరావతి, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సింగపూర్‌తో భారత్‌కు, ప్రత్యేకించి ఏపీకి మంచి సంబంధాలు ఉన్నాయని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. సింగపూర్ నిర్మాత లీ క్వాన్ యూ అంటే తనకు చాలా అభిమానమని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల క్రితం నుంచే సింగపూర్‌తో కలిసి పనిచేస్తున్నామని వివరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌లో సింగపూర్ టౌన్ షిప్‌నే నిర్మించామని ప్రస్తావించారు. మంగళవారం సింగపూర్‌లో సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్-2026 బిజినెస్ రోడ్ షోకి సీఎం చంద్రబాబు హాజరయ్యారు. ఈ ఏడాది నవంబర్‌లో జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ సన్నాహక సమావేశంగా సింగపూర్‌లో తొలి రోడ్ షోని సీఐఐ నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం కోసం సింగపూర్ మాస్టర్ ప్లాన్‌ని తయారు చేశామని తెలిపారు. బ్లూ, గ్రీన్ రాజధానిగా అమరావతి నిర్మాణం కోసం ఓ అద్భుతమైన బృహత్ ప్రణాళికను సింగపూర్ రూపొందించిందని వెల్లడించారు. ఏపీ రాజధాని అమరావతితో పాటు రాష్ట్రంలోని నగరాల అభివృద్ధి తదితర అంశాల్లో సింగపూర్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. సింగపూర్ తర్వాత పెట్టుబడులు పెట్టాలనుకుంటే ఆంధ్రప్రదేశ్ అత్యుత్తమ ప్రాంతమని స్పష్టం చేశారు. సింగపూర్ తర్వాత రెండో నివాసంగా అమరావతిని, ఏపీని మార్చుకోమని పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. ఏపీలో భూమి, అనుమతులను వేగంగా జారీ చేస్తున్నామని తెలిపారు. ప్రపంచ దిగ్గజ స్టీల్ కంపెనీ ఆర్సెలార్ మిట్టల్‌కు అన్ని అనుమతులు వేగంగా ఇచ్చామని చెప్పుకొచ్చారు. 2028 నాటికి ఆర్సెలార్ మిట్టల్ ఉత్పత్తి కూడా ప్రారంభించి ఏపీ నుంచి ఎగుమతులు చేస్తుందని తెలిపారు. అలాగే గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటవుతుందని.. వారికి గ్రీన్ ఎనర్జీని సరఫరా చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. పెట్టుబడులు వచ్చిన మరుక్షణం నుంచే పరిశ్రమలు ప్రారంభించేలా ఓ నిర్దిష్టమైన కాలవ్యవధిని నిర్ణయిస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. గూగుల్‌తో పాటు దాదాపు 10 గిగావాట్ల సామర్థ్యం ఉన్న డేటా సెంటర్లను వివిధ కంపెనీలు ఏర్పాటు చేయబోతున్నాయని ప్రస్తావించారు. ఎల్జీ ఎలక్ట్రానిక్స్ కూడా రూ.7 వేల కోట్లతో శ్రీసిటీలో గృహోపకరణాల తయారీ యూనిట్‌ను ప్రారంభిస్తోందని తెలిపారు. ఏపీలో అమలవుతున్న స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఇవి ప్రత్యక్ష ఉదాహరణలని చెప్పుకొచ్చారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులను తయారు చేసేందుకు ఆపరేషనల్ స్కిల్ యూనివర్శిటీనీ కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. పనిచేస్తూనే నైపుణ్యాలు, ఉన్నత విద్యార్హతలను సాధించేలా ఈ ఆపరేషనల్ యూనివర్శిటీలు ఉపకరిస్తాయని తెలిపారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా టెక్నాలజీ విస్తృతి పెరిగిందని.. దీని ఆధారంగానే నిర్ణయాలు ఉంటున్నాయని చెప్పుకొచ్చారు. ఏపీలోనూ అదే తరహాలో డేటా డ్రివెన్ నిర్ణయాలను తీసుకుని పౌరసేవల్ని అందిస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# జనసేనలో జాయినింగ్స్ కమిటీ ఏర్పాటు

**– పార్టీలో చేరేవారి కోసం 14మందితో కమిటీ – పార్టీ అధినేత పవన్ కల్యాణ్ వెల్లడి**

**అమరావతి, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జనసేన పార్టీలో చేరికల సమన్వయానికి జాయినింగ్స్ కమిటీని నియమించినట్లు పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వెల్లడించారు. జనసేన పార్టీలో చేరేందుకు ఆసక్తి కనబరుస్తున్న ఇతర పార్టీల నేతలు, విద్యావంతులు, సామాజికవేత్తలు, తటస్థులను పార్టీలోకి ఆహ్వానించేందుకు ప్రత్యేకంగా ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 14 మంది సభ్యులతో కూడిన ఈ కమిటీ చేరికలను సమన్వయం చేస్తుందన్నారు. ఢిల్లీ పర్యటన అనంతరం ఈ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి పార్టీలో చేరికలపై దిశానిర్దేశర చేయనున్నట్లు పవన్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్ తరహాలోనే తెలంగాణలోనూ జాయినింగ్స్ కమిటీ నియామకానికి సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కమిటీలో ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, వంశీకృష్ణ శ్రీనివాస్, పంతం నానాజీ, ఎంపీ లింగమనేని రమేశ్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కిలారి రోశయ్య, సామినేని ఉదయభాను, పార్టీ సీనియర్ నేతలు కొటికలపూడి చినబాబు, డా.హరిప్రసాద్, డా.పెదపూడి విజయ్ కుమార్, కొరికాన రవికుమార్, వంపూరు గంగులయ్య, టీసీ వరుణ్, ఆరణి మదన్ సభ్యులుగా ఉంటారని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# ఒత్తిడిని జయించి.. కార్యదక్షతను పెంచి..

**– మీడియా వృత్తిలో సమతుల్యతకు యోగానే మార్గం**

**– ఆరోగ్యవంతమైన మీడియా సమాజానికి నిత్య యోగా దివ్య ఔషధం**

**– జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రస్తుత వేగవంతమైన మీడియా రంగంలో పనిచేస్తున్న పాత్రికేయులు, ఫొటోగ్రాఫర్లు, ఇతర మీడియా ప్రతినిధులు నిరంతరం ఒత్తిడితో కూడిన పరిస్థితులను ఎదుర్కొంటున్నారని.. ఇలాంటి పరిస్థితిలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు వృత్తిపరమైన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి యోగా సాధన ఎంతో అవసరమని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. యోగాంధ్ర-2026లో భాగంగా మంగళవారం హరిత బెరం పార్కులో జరిగిన మీడియా థీమ్ యోగా కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ప్రతినిధులతో కలిసి యోగాసనాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే సమగ్ర జీవన విధానమని పేర్కొన్నారు. నేటి వేగవంతమైన జీవనశైలిలో ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కొంత సమయాన్ని కేటాయించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని సూచించారు. మీడియా ప్రతినిధులు నిరంతరం ఒత్తిడి, సమయపాలన, క్షేత్రస్థాయి విధుల కారణంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటారని, అలాంటి పరిస్థితుల్లో యోగా వారికి శారీరక, మానసిక ఉల్లాసాన్ని అందించడంలో ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యోగా ద్వారా ఒత్తిడిని అధిగమించి పనితీరును మరింత మెరుగుపరచుకోవచ్చని అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ ప్రత్యేక కార్యక్రమాలను కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని.. ఇదేవిధంగా యోగా వల్ల కలిగే ప్రయోజనాలపై విస్తృత ప్రచారం చేసి ప్రజలను యోగా సాధన వైపు మరింతగా ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. కార్యక్రమంలో భాగంగా చిన్నారుల ఆర్టిస్టిక్ యోగా కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.జయరాజు, ఉపాధ్యక్షులు చావారవి, సీనియర్ పాత్రికేయులు ఎం.గాంధీబాబు, వైవీవీ వరప్రసాద్, సీహెచ్ విజయభాస్కర్, సీహెచ్ నారాయణరావు, డీవీ రమణ, వైడీ ఆనంద్, సోషల్ మీడియా ప్రతినిధులు కిరణ్, నంద, మహేష్ తదితరులతో పాటు డీఐపీఆర్‌వో కేవీ రమణరావు, జిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్నప్రియదర్శిని, జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి బి.ప్రభాకరరావు, యువజన సంక్షేమ అధికారి డా. కొల్లేటి రమేష్, డీఎస్‌డీవో కె.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డ జగన్

**– అమర్‌నాథ్ గౌడ్ హత్యే ఇందుకు నిదర్శనం – మంత్రి లోకేశ్ ఘాటు విమర్శలు**

**అమరావతి, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జగన్ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఫైర్ అయ్యారు. వైసీపీ హయాంలో బీసీలపై కక్షపూరిత చర్యలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. బీసీలు అంటే జగన్‌కు ఎంత కక్షో అమర్నాథ్ గౌడ్ సజీవదహనం నిరూపించిందని పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలపై గొడ్డలి పార్టీ కక్షగట్టిందని ధ్వజమెత్తారు. మంగళవారం అమరావతి వేదికగా మీడియాతో మంత్రి లోకేశ్ మాట్లాడారు. తన అక్కను గొడ్డలి పార్టీ నేతలు వేధిస్తుంటే ప్రశ్నించినందుకు జూన్ 15, 2023న బడికి వెళ్తున్న 15ఏళ్ల బీసీ బాలుడు అమర్నాథ్ గౌడ్‌ను దారుణంగా కొట్టి, కట్టేసి సజీవ దహనం చేశారని మండిపడ్డారు.నాడు గొడ్డలి పార్టీ నిందితులను రక్షించేందుకు ప్రయత్నించిందని మంత్రి లోకేశ్ ఆగ్రహించారు. అన్యాయంగా అమర్‌నాథ్ గౌడ్‌ని చంపేశారని.. ఆయన మృతిచెంది మూడేళ్లు అవుతోందని తెలిపారు. గొడ్డలి పార్టీ వల్ల అన్నివిధాలా నష్టపోయిన అమర్నాథ్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి నారా లోకేశ్ భరోసా కల్పించారు. వైసీపీ పైశాచికత్వానికి పరాకాష్ట అమర్నాథ్ గౌడ్ హత్య అని మంత్రి కొల్లు రవీంద్ర మండిపడ్డారు. ఐదేళ్ల పాలనంతా బడుగు బలహీన వర్గాలను వేధించడమేనని ఆగ్రహించారు. చేయాల్సిన అరాచకాలన్నీ చేసి ఇప్పుడు వైసీపీ నేతలు నీతులు చెబుతున్నారని విమర్శించారు. కుట్రలతో రాష్ట్రంలో అలజడులే అజెండాగా జగన్ రెడ్డి అడుగులేస్తున్నారని దుయ్యబట్టారు. అమర్నాథ్ గౌడ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు మంత్రి కొల్లు రవీంద్ర.

## మొదటి పేజీ తరువాయి

# అద్భుత నగరంగా అమరావతి నిర్మాణం



ప్రసంగించారు. అమరావతిని నాలెడ్జ్ సిటీగా చేస్తున్నామని.. జాతీయ, అంతర్జాతీయ విద్యాసంస్థలను తీసుకువస్తున్నామని అన్నారు. క్వాంటం కంప్యూటింగ్ హబ్, డిజిటల్ ఇన్ఫాస్ట్రక్చర్ ప్రత్యేక ఆకర్షణలన్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ నగరంగా అమరావతి నిర్మాణం అవుతోందన్నారు. అమరావతిని సందర్శించి.. సరికొత్త ఆలోచనలతో అవకాశాలను వినియోగించు కోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. 25 ఏళ్ల క్రితం ఐటీ గురించి మాట్లాడానని... ఫస్ట్ మూవర్ అడ్వాంటేజ్‌తో ఈరోజు తెలుగువాళ్లు తలసరి ఆదాయంలో ముందున్నారని తెలిపారు. ఇప్పుడు ఏఐ వచ్చిందన్నారు. నాడు సైబరాబాద్‌ను అభివృద్ధి చేశామని... నేడు తెలంగాణకు ప్రధాన ఆదాయవనరుగా మారిందని చెప్పారు. రాష్ట్ర విభజనతో మరో నగరాన్ని నిర్మించే అవకాశం వచ్చిందని... అమరావతిని గ్రీన్ ఫీల్డ్ సిటీగా నిర్మిస్తున్నామని వెల్లడించారు. కృష్ణానది, ఇన్నర్ - ఔటర్ రింగ్ రోడ్లు, ఐకానిక్ బ్రిడ్జిలతో అద్భుతంగా అమరావతి రూపుదిద్దుకుంటోందని వివరించారు. స్పోర్ట్స్, ఫైనాన్సియల్, నాలెడ్జ్, జస్టిస్, టూరిజం, హెల్త్, మీడియా వంటి కాన్సెప్ట్స్ తీసుకున్నామన్నారు. ఒకే ఒక్క పిలుపుతో రాజధాని కోసం రైతులు 35 వేల ఎకరాలను అప్పగించారని... వాటిలో కొంత భాగాన్ని అభివృద్ధి చేసి రైతులకు తిరిగి ప్లాట్లు ఇస్తున్నామన్నారు. 21 కి.మీ పొడవునా వాటర్ ఫ్రంట్ నగరంగా అమరావతి ఉంటుందని తెలిపారు. సైక్లింగ్, వాకింగ్ ట్రాక్, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్ట్, అండర్ గ్రౌండ్ యుటిలిటీస్, గ్రీన్ ఎనర్జీ, నెట్ జీరో లక్ష్యంగా రాజధాని నిర్మాణం జరుగుతోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. సైబరాబాద్‌లో నాడు ఎకరం రూ.2 లక్షలు ఉంటే... నేడు రూ.200 కోట్లకు పెరిగిందన్నారు. అభివృద్ధి జరిగితే సంపద సృష్టి సాధ్యమవుతుం దనేందుకు సైబరాబాద్ నిదర్శనమని తెలిపారు.

# దుర్గమ్మకు అగ్గిపెట్టెలో పట్టే చీర బహుకరణ

అగ్గిపెట్టెలో పట్టే పట్టుచీరను బహూకరించారు. ఆలయ ఈవో శీనానాయక్‌కు మంగళవారం ఉదయం పట్టుచీరను అందజేశారు. ఇక్కత్ డిజైన్‌తో మగ్గంపై నేసిన ఈ చీర దాదాపు ఐదున్నర మీటర్ల పొడవు, 48 అంగుళాల వెడల్పు ఉంటుందని విజయ్‌కుమార్ తెలిపారు. దీని తయారీకి వారం రోజులు పట్టిందని చెప్పారు. ఇదిలావుంటే విజయవాడ ఇంద్రకీలాద్రిపై అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి.భక్తుల రద్దీ పెరగడంతో అందుకు అనుగుణంగా పనులు చేపట్టారు. దీంతో కనకదుర్గమ్మ ఆలయ స్వరూపం త్వరలోనే పూర్తిగా మారనుంది. రోజురోజుకు పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆలయ అధికారులు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా సుమారు రూ.82 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఎలివేటెడ్ క్యూ కాంప్లెక్స్, ఆరు అంతస్తుల ప్రసాదం పోటు, నూతన అన్నప్రసాదం కాంప్లెక్స్ పనులు చాలా వరకు పూర్తయ్యాయి. జులై చివరి నాటికి ఈ సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

# 'ఆయనో పెద్ద జోక్'..

ఇచ్చేస్తున్నారు. కానీ పలు రాష్ట్రాల్లో ఆ ఐక్యతను బలహీనపరిచింది ఎవరు?' అని ప్రశ్నించింది. కేరళలోని వామపక్ష పార్టీలు ఆయనపై చేసిన విమర్శలను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించింది. రాహుల్‌కు రాజకీయ పరిపక్వత, స్థిరత్వం లేకపోవడమే కూటమిలో విభేదాలకు కారణమని అభిప్రాయపడింది. కూటమిలో ప్రస్తుతం ఉన్న అనేక సమస్యలు కాంగ్రెస్ సొంత చర్యల నుంచే మొదలయ్యాయని పేర్కొంది. ఈ విమర్శలపై కాంగ్రెస్ అధికారికంగా స్పందించలేదు. అయితే, తమిళనాడు ప్రజల తీర్పునకు అనుగుణంగానే పార్టీ వ్యవహరించిందని కాంగ్రెస్ వర్గాలు ఈ ఆరోపణలను తోసిపుచ్చాయి.

# హోంమంత్రి అనితపై గుడివాడ కామెంట్స్

సగటు మహిళలందరినీ కించపరచినట్లే అని పవన్ అన్నారు. ప్రజా జీవితంలో ఉన్నవారి నోటి నుంచి వచ్చే ప్రతి మాటను పౌర సమాజం గమనిస్తోందనే విషయాన్ని మరచిపోవద్దని పవన్ అన్నారు. రాజకీయాల్లో విమర్శలు, ప్రతి విమర్శలు ఉంటాయని... అవి విధానపరంగానే ఉండాలన్నారు. ఒక పాలసీ నచ్చకపోతే ఆ పాలసీ విషయంపైనే విమర్శించాలన్నారు. వాచలత్వంతో ఇళ్లలోని స్త్రీలను కూడా కించపరచే నైజం ఉన్న పార్టీ చేసే కామెంట్స్‌లను బలంగా తిప్పికొట్టేటప్పుడు వాళ్లు చేస్తున్న వ్యాఖ్యల్లో ఎంతటి అభ్యంతరకరమైన విషయం ఉందో ప్రజలకు తెలియజెప్పాలని కూటమి నేతలకు సూచించారు. కూటమి నేతలందరూ పౌర సమాజం హర్షించే భాషలో మాట్లాడి బలంగా బదులివ్వాలన్నారు. అవతలి పార్టీవాళ్ల మాదిరి దిగజారుడు భాష, అర్థరహిత వ్యాఖ్యలు కూటమి నేతలకు అవసరం లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

# నీట్ రీ ఎగ్జామ్‌తో అప్రమత్తం

టెలిగ్రామ్‌లో ఈనెల 30 వరకు మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌ను పూర్తిగా నిలిపివేయాలని ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష పూర్తయిన తర్వాత పాత టైమ్‌స్టాంప్‌లతో నకిలీ 'పేపర్ లీక్' ఆధారాలు సృష్టిస్తున్న ముఠాలను అడ్డుకోవడానికే మెసేజ్ ఎడిటింగ్ ఫీచర్‌పై నిషేధం విధించినట్లు తెలుస్తోంది. పేపర్ లీక్ పేరుతో విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న నకిలీ టెలిగ్రామ్ ఛానళ్లపై ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగాలు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. అహ్మదాబాద్‌లో 8 టెలిగ్రామ్ ఛానళ్లను నడుపుతూ రూ.1.5 కోట్ల మోసాలకు పాల్పడిన అంతర్రాష్ట్ర ముఠాను సైబర్ క్రైమ్ బ్రాంచ్ అరెస్ట్ చేసింది. జూన్ 21న జరగనున్న రీ-ఎగ్జామ్‌కు ముందు ప్రశ్నాపత్రం లీక్ అయ్యిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాలపై ఎన్‌టిఎ స్పందించింది. అవన్నీ తప్పుడు ప్రచారాలేనని స్పష్టం చేస్తూ, విద్యార్థులు అధికారిక సమాచారం కోసం వెబ్‌సైట్ ను మాత్రమే అనుసరించాలని సూచించింది. ఎవరైనా మోసాలకు పాల్పడితే వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కి ఫిర్యాదు చేయాలని కేంద్ర ప్రభుత్వం కోరింది.

# అమర్‌నాథ్ వ్యాఖ్యలపై సరైన సమయంలో సమాధానం చెప్తా

అనవసర వ్యక్తులు చేసిన వ్యాఖ్యలపై చర్చకు తావివ్వను. మేం ఎక్కడైనా పొరపాటున ఒక మాట మాట్లాడితే ముఖ్యమంత్రి చంద్రబాబు మమ్మల్ని పిలిచి మందలిస్తారు. ఇది ఇతర పార్టీలు ఎందుకు పాటించవో అర్థంకాదు. మహిళల్ని కించపరిచే వారు, అసభ్య పోస్టులు పెట్టేవారు తమకూ తల్లి, చెల్లి ఉన్నారని గ్రహించాలి" అని అనిత హితవు పలికారు.

# విధ్వంసం నుంచి విజయోత్సవం వైపుగా రాష్ట్రం పయనం

**- ఎమ్మెల్యే అమర్ అధ్యక్షతన కూటమి ఆధ్వర్యంలో జరిగిన విజయోత్సవ సభ - భారీగా తరలివచ్చిన కూటమి నాయకులు**



**పలమనేరు, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద కూటమి రెండేళ్ల సమ్మకం అభివృద్ధి సంక్షేమం పేరిట మంగళవారం విజయోత్సవ సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కూటమి నాయకులు కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.....2024 లో కూటమి ఏర్పడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఒక పక్క సంక్షేమం ఒక పక్క అభివృద్ధి కార్యక్రమాలు రెండూ సమపాళ్లలో చేయడమే కాకుండా... గత ఐదేళ్లలో జరిగినటువంటి ఆర్థిక విధ్వంసం నుంచి బయటపడేసిన ఘనత ఈ ప్రభుత్వాని దన్నారు. గత ఐదేళ్లలో భయాందోళనలకు గురైనటువంటి రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చి, పెట్టుబడిదారులను పరిశ్రమలను గతంలో భయపెట్టి పారద్రోలినటువంటి సందర్భం నుంచి... మళ్లీ ఈ రాష్ట్రానికి ఒక నమ్మకాన్ని తీసుకొచ్చినటువంటి ఘనత ఈ కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గత ఐదేళ్లలో ఒక రకమైనటువంటి భయంకరమైనటువంటి వాతావరణాన్ని మనందరం చూశామని ప్రజాస్వామ్యం ఎక్కడా కనిపించలేదన్నారు. ఏదైతే గతంలో కూటమి చెప్పిన మాట ప్రకారం "సూపర్ సిక్స్" పథకాలు మేము అందిస్తామని చెప్పామో ఆ సూపర్ సిక్స్ పథకాలను నూటిగా అందజేసిన ఘనత తమదే అని అన్నారు. ఇక అభివృద్ధి కార్యక్రమాల పరంగా చూస్తే... ఈరోజు అమరావతి గాని, పోలవరం గాని, ఈరోజు రాష్ట్రానికి వచ్చేటటువంటి పెట్టుబడులు గాని గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు గాని నియోజకవర్గానికి సంబంధించినటువంటి వాటికి కావాల్సినటువంటి మౌలిక సదుపాయాలు గాని సాగునీటికి సంబంధించిన మన కళ్లముందే కనపడేటువంటి హంద్రీ-నీవా లాంటి ప్రాజెక్టులు గాని అన్నీ కూడా ఈ రెండేళ్లలో ప్రధానంగా ఒక దారికి తీసుకొచ్చినటువంటి సందర్భాన్ని గుర్తుచేసుకోవాలన్నారు. అదే కాకుండా ఒక పక్క సంక్షేమం, ఒక పక్క అభివృద్ధి రెండూ కూడా సమపాళ్లలో ఈ ప్రభుత్వం చేపడుతున్న విషయాన్నీ కూటమి పార్టీలకు సంబంధించినటువంటి నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. రెండేళ్ల తర్వాత ప్రతిపక్ష పార్టీలు రోడ్ల పైకి వచ్చి, వాళ్లు గతంలో చేసినటువంటి విధ్వంసాన్ని మరిచి, సోషల్ మీడియాలో ఈరోజు ఏదో అన్యాయం జరిగిపోతా ఉంది, ఈరోజు ఏదో మోసం జరిగిపోతోంది అంటూ చేస్తున్న దుష్ప్రచారం తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రశాంతంగా ప్రజాస్వామ్యబద్ధంగా వ్యాపారస్తులు గాని, రైతులు గాని, సామాన్య ప్రజానీకం గాని ధైర్యంగా వాళ్ల కార్యక్రమాలు వాళ్లు చేసుకునేటువంటి అవకాశం ఈ ప్రభుత్వంలో ఉందన్నారు. ఈరోజు "నా భూమి.. నా చేతుల్లోనే" ఉందని చెప్పుకునేటువంటి పరిస్థితి ఉంది. గతంలో ఎవరి ఆస్తులు కూడా వాళ్ల చేతుల్లో లేవని వివరించారు. నేడు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏదో రోడ్లపైకి వచ్చేస్తే సామాన్య ప్రజలు ఎవ్వరూ నమ్మేటటువంటి పరిస్థితి లేదన్నారు. మనం చేసినటువంటి కార్యక్రమాలు మనం ప్రజలకు చెప్పొల్సినటువంటి అవసరం, ఆ బాధ్యత మనపై ఉంది కాబట్టి.. ఈరోజు ఈ కార్యక్రమం ద్వారా మనం ఏం చేస్తున్నామో, ఏం చేయబోతు ఉన్నామో దాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లామని ఆయన పిలుపునిచ్చారు. ఇక నియోజకవర్గానికి సంబంధించి దాదాపు గత ప్రభుత్వంలో ఆపేసిన పనులన్నీ.. దాదాపు ఈఏపీ కింద 134 కోట్ల రూపాయల పనులు ఆపేస్తే, ఆ పనులన్నీ కూడా ఈ మధ్యనే ఒక నెల క్రితమే 100 శాతం టెండర్లు వేసి, ఆ పనులన్నీ కూడా కంప్లీట్ చేశామన్నారు. ఈ రెండు సంవత్సరాలలో అదే విధంగా ప్రభుత్వం నుంచి మనకు ఏదైతే ఎన్ ఆర్ ఈ జి ఎస్ కింద గ్రామాల్లో మొత్తం కూడా రోడ్లు కంప్లీట్ చేశామని, గత ప్రభుత్వంలో ఆపేసినటువంటి ఆ పనులన్నిటికీ కూడా కంప్లీట్ చేసే కార్యక్రమం చేశామన్నారు. హంద్రీ-నీవా ద్వారా నీళ్లు ప్రతి చెరువుకు ఇచ్చేటువంటి కార్యక్రమం మన్ని మొదలుపెట్టామని రాబోయే కాలంలో 100 శాతం దాన్ని కూడా కంప్లీట్ చేసేటువంటి కార్యక్రమాన్ని మనం తీసుకోబోతా ఉన్నామని కార్యకర్తలకు భరోసా నింపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని బట్టి అందరికి లుగా కూడా అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పూర్తి చేసుకుందామన్నారు. ఈ విజయోత్సవ సభలో మార్కెట్ కమిటీ చైర్మన్ రాజన్న, మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు, మాజీ ఎంపీపీ విజయ భాస్కర్ రెడ్డి, బాలాజీ కోపరేటివ్ బజార్ అధ్యక్షులు ఆర్వి బాలాజీ, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ రంగనాథ్, రాష్ట్ర కృష కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం గౌడ్, రాష్ట్ర ఐరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ గజేంద్ర, కూటమి నాయకులు దిలీప్ కుమార్, ప్రభాకర్, శరవణ, ఖాజాపీర్, మంజులమ్మ, సుబ్రహ్మణ్యం రెడ్డి, బత్తి గౌడు, విశ్వనాథ్, పర్వీన్, కుట్టి నాగరాజ్ గిరి, బి ఆర్ సి కుమార్ భాస్కర్ యాదవ్, శ్రీధర్, మదన్ దీపికా కృష్ణమూర్తి, సురేష్, లోకేష్, మురళీకృష్ణ, జగ్గా, గణేష్, నాగరాజు రెడ్డి, పెద్దబ్బ, సోమశేఖర్ గౌడ్, గిరిధర్ గోపాల్, భాస్కర్ రెడ్డి, నదీమ్, గణేష్, సెల్వరాజ్, అన్ని మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లా

## మాతా శిశు మరణాలు జరగకుండా చూడాలి

**-డిఎం అండ్ హెచ్ఓ బాలకృష్ణ నాయక్**

**తిరుపతి,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వి బాలకృష్ణ నాయక్ అధ్యక్షతన జిల్లా స్థాయిమాతృ మరియు శిశు మరణాల సమీక్ష సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో జిల్లావ్యాప్తంగా మే నెలలో జరిగిన ఒక మాతృ మరణం,ఏడు శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మాతాశిశు మరణాలు సంభవించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారులనుండి మరియు చికిత్స అందించిన ఆసుపత్రుల దాక్టర్ల నుండి కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, అంగన్వాడీ కార్యకర్తలు బాధితులకు అందించిన సేవలను సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది గర్భవతులు, బాలింతలు, చిన్నపిల్లలను క్రమం తప్పకుండా సందర్శించి వారికి అన్ని రకాల ఆరోగ్య సేవలు, సూచనలు, సలహాలు సకాలంలో అందించి మాతా శిశు మరణాలు జరగకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో డి ఐ ఓ డాక్టర్ శాంతకుమారి, డీ సి హెచ్ ఎస్ డాక్టర్ ఆనందమూర్తి, గవర్నమెంట్ మెటర్నిటీ హాస్పిటల్, రుయా హాస్పిటల్ మరియు ప్రైవేట్ ఆసుపత్రుల పీడియాట్రిషియన్లు, గైనకాలజిస్ట్ డాక్టర్లు, కమిటీ సభ్యులు,డి పి హెచ్ ఎన్ ఓ మంజుల, పెళ్లకూరు, దామినేడు, ముక్కవారిపల్లి, ఓబుల వారిపల్లి, ఎంపేడు, చిన్నపాండూరు, కుప్పంబ దూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, సూపర్వైజర్లు,మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు,ఆరోగ్య కార్యకర్తలు,ఆశా కార్యకర్తలు,తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## ఎర్రచందనం స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష



**తిరుపతి,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన స్మగ్లరుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 6లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు నిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శేషాచలం రిజర్వు అటవీ ప్రాంతంలో జరుగుతున్న ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టే లక్ష్యంతో ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక దళం కఠిన చర్యలు అమలు చేస్తోంది. ఆర్ఎస్ఎఎస్టీఎఫ్ హెడ్ ఎల్ సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్పీ జె. కులశేఖర్ పర్యవేక్షణలో గతంలో నమోదయ్యి, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఇందులో భాగంగా క్రైమ్ నెంబరు 74/2018 కేసులో వేలూరు జిల్లా అనైకట్టు తాలూకా పెరియపట్టు గ్రామానికి చెందిన ముత్తు ఏలుమలై పెరుమాళ్లపల్లి బీటు, టీఎన్ పాళెం సెక్షన్, తిరుపతి రేంజ్ పరిధిలో అరెస్టయ్యాడు. ఇతని నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఐదేళ్ల జైలు శిక్ష తో పాటు రూ. 6లక్షల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. తదుపరి కోర్టు ఆదేశాలు మేరకు అతనిని నెల్లూరు సెంట్రల్ జైలులో అప్పగించడం జరిగింది. శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికి అక్రమ రవాణా చేయడం, అడవిలోకి అక్రమంగా ప్రవేశించే నేరస్తులకు ఇది హెచ్చరికగా పరిగణించబడుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ. శ్రీనివాస్ తెలిపారు. ముద్దాయిలకు శిక్షలు పడేలా సహకరిస్తున్న కోర్టు సిబ్బందిని ఆయన అభినందించారు.

## రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ

**గూడూరు,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ నందు రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గూడూరు పట్టణంలో రోటరీ వెస్ట్ క్లబ్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని అందులో భాగంగా మహిళలు స్వయం ఉపాధి పొందాలని ఉద్దేశంతో కుట్టు మిషన్లు ఇవ్వటం జరిగిందని అన్నారు. ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మునిగిరిష్ మాట్లాడుతూ డిస్ట్రిక్ గవర్నర్ ద్వారా వచ్చిన ఈ కుట్టు మిషన్లని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ రాఘవరెడ్డి, గోపాల్ రెడ్డి, వాసు గౌడ్, సనత్ రెడ్డి, నాసిన నాగులు, కృష్ణంరాజు, మూలి హరినాథ్ రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, తాళ్లూరి శ్రీనివాసులు, కోట కృష్ణ, గిరిబాబు, సిద్ధారెడ్డి, కృష్ణారెడ్డి, జూ. హరినాథ్ రెడ్డి, బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యానవన పంటలను ఆదుకోవాలి

**- డ్రిప్ ఇరిగేషన్ కు ప్రభుత్వం చేయూత ఇవ్వాలి - సీపీఐ నాయకులు డిమాండ్**

**గూడూరు , జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఉద్యానవన పంటలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్ , సీపీఐ పట్టణ కన్వీనర్ సునీల్ లు పేర్కొన్నారు . గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల పక్షపాతి అనిచెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం ఉద్యాన వన రైతులను ఆదుకోవాలన్నారు. ఇప్పటికే వర్షాలు సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెట్ట ప్రాంతాల రైతులు డ్రిప్ ఇరిగేషన్ మీదే ఆధారపడి పంటలను పండిస్తున్నారన్నారు. ప్రభుత్వం పెండింగ్ లో వున్న రెండు వేల కోట్ల రూపాయలను డ్రిప్ ఇరిగేషన్ పరికరాల కంపెనీ లకు బాకాయిలను మంజూరు చేస్తే వారు రైతులకు సకాలంలో పరికరాలను అందచేస్తారన్నారు. ఇకనైనా ప్రభుత్వం డ్రిప్ ఇరిగేషన్ పై దృష్టి సారించాలని , అదేవిధంగా రైతులకు రాయితీ ద్వారా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.టి.యు.సి జిల్లా అధ్యక్షులు కె.నారాయణ , జితేంద్ర, రాజేష్, వినయ్, వెంకటేశ్వర్లు , తదితరులు పాల్గొన్నారు.

## పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

**19న ఒంగోలులో జరిగే ట్రాక్టర్ ర్యాలీకి తరలిరండి**



**కందుకూరు,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, పొగాకు రైతుల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ఈనెల 19న ఒంగోలులో జరిగే ట్రాక్టర్ ర్యాలీ కి రైతులందరూ తరలిరావాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జే. జయంతిబాబు కోరారు. ఈరోజు ఉదయం కందుకూరులోని 27వ పొగాకువేలం కేంద్రం వద్ద రైతులను ఉద్దేశించి జే. జయంతిబాబు మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ పొగాకు ధర విషయంలో రైతులందరూ సంతృప్తికరంగా ఉన్నారని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కే అచ్చె నాయుడు పేర్కొనడం హాస్యాస్పదమని పేర్కొన్నారు. పొగాకు పంట పండించేందుకు రైతులకు అధికంగా ఖర్చులు అయ్యాయని,తీరా పండినపంటకు ప్రభుత్వం ధర కల్పించకపోవడం పట్ల రైతులందరూ ఆందోళనకరంగా ఉన్నారని తెలిపారు. ఇటీవల వ్యవసాయ శాఖా మంత్రి ఇచ్చిన ప్రకటన అందుకు విరుద్ధంగా ఉందని తెలిపారు. రైతులందరికీ కనీస మద్దతు ధర రాక పొగాకు వేలం కేంద్రాల వద్ద నిరసన తెలుపుతున్నా, ప్రభుత్వానికి పట్టకపోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 19 జరిగే ట్రాక్టర్ ర్యాలీకి అధిక సంఖ్యలో రైతులు తరలి రావాలని కోరారు. ఈరోజు పొగాకువేలం కేంద్రం వద్ద రైతులతో జరిగిన సమావేశంలో సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు ఎస్.ఏ. గౌస్, జీవీబీ కుమార్,రైతులు టీ. రమణయ్య, దామా. ప్రవీణ్, వలేటి. నరసింహం, రామచంద్రారెడ్డి, గుత్త.గోపి తదితరులు పాల్గొన్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 పరిశీలన ప్రారంభం

**- 3500 కుటుంబాలకు ఎన్యుమరేషన్ ఫారమ్స్ పంపిణీ**

**రామచంద్రపురం, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమం ప్రారంభించామని తహశీల్దార్ యు మధుసూదన్ రావు తెలిపారు. మంగళవారం మండలంలోని 23 పంచాయతీలలో 40 పోలింగ్ కేంద్రాలలో కార్యక్రమం బి ఎల్ వో లు శరవేగంగా ప్రారంభించారు. మండలంలో 26,0052 ఓటర్లను 2002 ఓటర్ల జాబితాకు అనుసంధానం చేసామన్నారు. గ్రామాలలో బి ఎల్ వో లు ఇంటింటికి వెళ్లి ఎన్యుమరేషన్ దరఖాస్తులను 3,500 కుటుంబాలకు అందజేసినట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ మధుసూదన్ రావు తెలిపారు. బి ఎల్ వో లు ఓటర్ల పరిశీలన కార్యక్రమాన్ని పారదర్శకంగా, తప్పులు తడకలు లేకుండా చేపట్టి, నాణ్యతతో కూడిన ఓటర్ల జాబితాను తయారీ చేయించాలని సిబ్బందిని ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎన్యుమరేషన్ ఫారమ్స్ లో పూర్తి సమాచారంతో ఓటర్ల కలర్ ఫోటోలు జతపరిచి బిఎల్ఓ లకు అందచేయాలని ఆయన కోరారు.

## త్రిబుల్ ఐటీలో సీటు సాధించిన రైతు బిడ్డలు

**- దగుమాటి నమృత, వట్టికాల రేవంత్ కుమార్**





**కావలి, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కావలి,రిపోర్టర్. బ్రాహ్మణక్రాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరోసారి తన ప్రతిభ ను చాటుకుంది. ఈ పాఠశాలకు చెందిన దగుమాటి నమృత కు ఇడుపులపాయ లో సీటు రాగా, వట్టికాల రేవంత్ కుమార్ అనే విద్యార్థి కి శ్రీకాకుళం లోని త్రిబుల్ ఐటీలో సీటు సాధించి ప్రతిభ కనబరిచాడు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. జయలలిత మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి దగుమాటి నమృత, వట్టికాల రేవంత్ కుమార్ లకు త్రిబుల్ ఐటి లో సీటు వచ్చిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన విద్య అందుతోందనే విషయానికి ఇది నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. బ్రాహ్మణక్రాక గ్రామానికి చెందిన దగుమాటి చంద్ర శేఖర్ రెడ్డి, జయలక్ష్మి దంపతులు కుమార్తె నమృత, జర్నలిస్ట్ వట్టికాల రమణయ్య, ఉమామహేశ్వరి దంపతుల కుమారుడు రేవంత్ కుమార్ లు కష్టపడి చదివి ఈ విజయాన్ని అందుకున్నారు. గురువుల మార్గదర్శకత్వం పట్టుదల అతని విజయానికి ప్రధాన కారణమయ్యాయి. పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులపై చూపుతున్న శ్రద్ధ ఫలితంగా ఇలాంటి విజయాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువు తున్న విద్యార్థులకు ఇది ప్రేరణగా నిలుస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠ శాలలు కూడా ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోవని ఈ విజయంతో మరోసారి రుజువైంది. విద్యార్థి రేవంత్ కుమార్ కు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. పాఠశాల యాజమాన్యం కూడా అతని ప్రతిభను కొనియాడింది. ఇలాంటి విజయాలు మరింత మంది విద్యార్థులను ఉన్నత లక్ష్యాల వైపు దారితీస్తాయని అభి ప్రాయపడ్డారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివినా పెద్ద విజయాలు సాధించ వచ్చని ఈ సంఘటన స్పష్టం చేస్తోంది. విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే విజయాలు వారి సొంతమవుతాయని ఉపాధ్యాయులు సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల వాతావరణం, బోధన విధానంపై గ్రామస్తులు కూడా ప్రశంసలు కురిపించారు.

## ఖేత్ బచావో అభియాన్‌పై అవగాహన



**చంద్రగిరి,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చంద్రగిరి మండల పరిధిలోని అనంత గుర్రప్పగారి పల్లెలో, పశువుల ఎరువు, కంపోస్టు, నీమాస్త్ర, ఘనజీవామృతం, బీజామృతం వినియోగించడం ద్వారా అధికదిగుబడులు సాధించవచ్చని తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల, ప్రొఫెసర్ డాక్టర్ టి. లక్ష్మి, డాక్టర్ ఎ.ప్రశాంతి మరియు డాక్టర్ పి. నాగిరెడ్డి అన్నారు. వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం ఖేత్ బచావో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూసార పరిరక్షణ, సుస్థిర వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి సాధించడంపై వివరించారు. రైతులు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించుకోవాలి అన్నారు. పశువులకు పోషక ఆహారంతో కూడిన పచ్చిమేత, ఖనిజ లవణ మిశ్రమం వినియోగించడం వలన పాల దిగుబడి పెరుగుతుందన్నారు. తిరుపతి ఎస్వీ కళాశాల నాలుగవ సంవత్సరం ఈ ఎల్ పి సాయిల్ సైన్స్ మరియు హార్టికల్చర్ విద్యార్థులు నేల నమూనా సేకరించడంపై ప్రదర్శన, వివిధ అంశాలయినటువంటి నీమాస్త్ర, జీవామృతం, పంచగవ్య, కంపోస్టు, జీవన ఎరువులు, పచ్చిరొట్టె ఎరువులు, సమగ్ర పోషకయాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏపీ సీఎం ఎఫ్. ఎఫ్ ఎం టి ఇంచార్జ్ బి. శంకర్, ఐ సి ఆర్ పి డి. హేమలత, కె. అనురాధ బి ఆర్ సి సెంటర్ మరియు ఎన్. రమ్య బీజామృతం తయారీ విధానం మరియు వాడకం గురించి రైతులకు ప్రదర్శించారు.

## ముత్యాల అలంకారంలో మురిపించిన గంగమ్మ



**తిరుపతి సిటీ,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ముత్యాల పూసల అలంకారంలో మురిపించారు. జాతర ముగిసిన తర్వాత చివరి వారమైన ఐదవ మంగళవారం దేవస్థానం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. తెల్లవారుజామున అమ్మవారికి ప్రత్యేక అభిషేకము చేసిన అనంతరము ఈ నాటి అలంకరణ దాతలైన కవిత,శివకుమార్, లీలాచంద్ర గార్ల సహకారముతో ముత్యాల పూసలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి మంగళవారం కావడంతో భక్తులు మారు పొంగళ్ళు పెట్టడానికి పోటెత్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయం భక్తులతో కిటికీలాడింది. భక్తులు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆలయ అధికారులు పాలకమండలి సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజ కార్యక్రమములో ఆలయ పాలకమండలి చైర్మన్ నైనార్ మహేష్ యాదవ్,కార్యనిర్వహణాధికారి ఎ. జయకుమార్, పాలకమండలి సభ్యులు మధులత, వినుకొండ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## అమర్నాథ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు

**నాయుడుపేట ,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సూళ్లూరుపేట నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆదేశాల మేరకు నాయుడుపేట తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు 786 రఫీ సూచనలతో తెలుగుదేశం పార్టీ మహిళా నాయకుల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం మినిస్టర్ గారి మీద వైసిపి నాయకుడు గుడివాడ అమర్నాథ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా నాయుడుపేట పట్టణంలో గాంధీ మందిరం దగ్గర అమర్నాథ్ చిత్రపటంపై మహిళలు గుడ్లు పగలగొట్టి ,అమర్నాథ్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు ఇటువంటి వ్యాఖ్యలు చేయడం దారుణం అని..మహిళలు ఈ వైసీపీ నాయకులకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ టౌన్ మహిళా అధ్యక్షురాలు రేవతి, కన్నెమ్మ, సంపూర్ణమ్మ హైమావతి,సునీత, దగ్గోలు బబిత,కోకిల, విజయమ్మ, సరసమ్మ, లక్ష్మీ మరియు ఇతర మహిళా నాయకులు పాల్గొన్నారు.

## డిసిసిబిలో డిపాజిట్లకు భద్రత : నాగవేణి




**చౌడేపల్లి ,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డిసిసి బ్యాంకుల్లో డిపాజిట్లకు భద్రత ఉంటుందని బ్యాంకు మేనేజర్ నాగవేణి అన్నారు మంగళవారం చౌడేపల్లి బ్రాంచ్ నందు వినియోగదారుల సమావేశం జరిగింది. డిసిసి బ్యాంకులో అత్యధిక వడ్డీ డిపాజిట్ పై ఉంటుందన్నారు. రైతులకు దీర్ఘ స్వల్పకాలిక రుణాలు మంజూరు చేస్తారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు హౌసింగ్ లోన్ అందివ్వడం జరుగుతుందన్నారు. బంగారు పై రుణాలు సైతం అందిస్తామన్నారు. ఈ అవకాశాలను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది వినియోగదారులు పాల్గొన్నారు

## మరణించిన మిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం



**చౌడేపల్లి, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మరణిం చిన మిత్రుడి కుటుంబానికి సహచరులు ఆర్థిక సాయం చేశారు. చౌడేపల్లి ఉన్నత పాఠశాలలో 2001-02 పూర్వపు విద్యార్థులలో ఒకరైన శ్రీనివాసులు మేస్త్రి పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. చిన్న కొండా మరి కి చెందిన అతను ఆకస్మికంగా మృతి చెందాడు. దీంతో పూర్వపు విద్యార్థులు అందరూ కలిసి రూ 26 వేలను మృతుడి తండ్రికి అందించారు. మృతుడు శ్రీనివాసులు కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 2001-02 పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల బదిలీలో సీనియార్టీని పరిగణలోకి తీసుకోవాలి

**పలమనేరు,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కులాలను పరిగణంలోకి తీసుకోకూడదు ఏ బి సి డి జోలికి వెళ్ళకూడదు ఇటీవల ప్రభుత్వము ఉపాధ్యాయులు సొంత జిల్లాలకు వెళ్లాలన్న ఏ బి సి డి ప్రతిపాదన తెచ్చి బదిలీల్లో కూడా మాలలకు అన్యాయం జరుగుతుందని బహుజన్ సమాజ్ పార్టీ చిత్తూరు జిల్లా ఇన్చార్జి తన ఆవేదనను వ్యక్తం చేశారు దీనివల్ల ప్రభుత్వం కూడా ఎరాగాటంలో పడే అవకాశం ఉంటుంది కేవలం ఓట్ల కోసమే ప్రభుత్వం ఇలాంటి దిగజారుడు ఆలోచన చేస్తున్నది ఒక్కొక్క జిల్లాలో ఒక్కొక్క కులము వారు ఎక్కువగా ఉంటారు మీరు అనుకున్నట్లు కులాలవారీగా బదిలీల ప్రక్రియ ప్రారంభిస్తే బహుజన సమాజ్ పార్టీ తరపున నిరసన రాస్తారోకో ధర్నా అసెంబ్లీలను ముట్టడించే కార్యక్రమం చేస్తుందని ప్రభుత్వానికి సున్నితంగా తెలియజేస్తున్నాం పారదర్శకత ద్వారా సీనియార్టీని పరిగణలోకి తీసుకొని బదిలీల ప్రక్రియ చేయాలని బిఎస్పి వారు డిమాండ్ చేశారు.

## ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శిగా శ్రీకాంత్



**కుప్పం, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అనంతపురం జిల్లాకు చెందిన శ్రీకాంత్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన వ్యక్తిగత కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ఇటీవల ఉత్తర్వులు జారీ అయ్యాయి. మంగళవారం కుప్పంలోని టీడీపీ కార్యాలయాన్ని సందర్శించిన శ్రీకాంత్ స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై పలకరించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. మరో రెండు మూడు రోజుల్లో శ్రీకాంత్ ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శిగా అధికారికంగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. ఈ నియామకం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

## విద్యార్థినులకు రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన

**- కుప్పం జెడ్పీహెచ్ బాలికల పాఠశాలలో పోలీసుల ప్రత్యేక కార్యక్రమం**



**కుప్పం, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యార్థినులు సమాజంలో సురక్షితంగా ఉండటంతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని కుప్పం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ యాదవ్ సూచించారు. మంగళవారం కుప్పం పట్టణంలోని జెడ్పీహెచ్ బాలికల పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వెంకటేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడిన సీఐ మల్లేష్ యాదవ్, రోడ్డు ప్రమాదాలను నివారించడంలో ట్రాఫిక్ నియమాల పాటన ఎంతో ముఖ్యమని తెలిపారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే సమయంలో హెల్మెట్ ధరించడం, రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం, ట్రాఫిక్ సంకేతాలను తప్పనిసరిగా పాటించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. అలాగే మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన చట్టాలు, రక్షణ చర్యల గురించి వివరించారు. సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో సోషల్ మీడియా వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంకు సమాచారం ఎవరికీ తెలియజేయవద్దని సూచించారు. ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థినులకు వివరించారు. బాలల రక్షణ కోసం అమలులో ఉన్న పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించిన సీఐ, మంచి స్పర్శ, చెడు స్పర్శ మధ్య తేడాలను విద్యార్థినులకు వివరించారు. ఎలాంటి అనుచిత ప్రవర్తన ఎదురైనా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా ధైర్యస్పర్శ కార్యక్రమం ద్వారా మహిళలు, బాలికలకు అందుబాటులో ఉన్న సహాయ సేవలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


**- డా.పూజిత,డా.శ్రీలక్ష్మి**



**రామకుప్పం ,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని విజిలాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని విజలా పురం మరియు సింఘసముద్రం జీడిమాకులపల్లి గ్రామాలలో వైద్య అధికారి డాక్టర్ కే పూజిత డాక్టర్ సాయి శ్రీ ఆధ్వర్యంలో సీజన్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం అయినది, ఈ సందర్భంగా వారు ప్రజల ఉద్దేశించి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరుతూ దోమల యొక్క లార్వాలను గుర్తించి దానిని ప్రజలకు చూపించి మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు కార్యక్రమం నిర్వహించి అందులో భాగంగా ప్రజలకు లార్వల పట్ల అవగాహన మరియు ఫ్రైడే గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ బాలు, ఎల్తేజికేటర్ ప్రమీల ఎస్ సి హెచ్ ఓ లావణ్య, ఏఎన్ఎం సుకన్య అశ్వత ,ఆశ కార్యకర్తలు సౌభాగ్య భాగ్యలక్ష్మి ప్రమీల, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ గుండాలమ్మ జాతర

**- అమ్మవారికి తొలి పూజ చేసిన పూజ చేసిన చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు దంపతులు**



**చిత్తూరు, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి, స్థానిక టాప్ లైన్ లో వెలసిన శ్రీ గుండాలమ్మ 33 వ జాతర మహోత్సవాన్ని మంగళవారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ క్రమంలో ఉదయం చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు, ఆయన సతీమణి సీకే లావణ్యబాబు హాజరై అమ్మవారికి ఏర్పాటు చేసిన తెరను తొలగించి తొలి పూజ నిర్వహించారు. వీరికి ఆలయ ధర్మకర్త మురుగేష్, జాతర నిర్వాహణ కమిటీ సభ్యులు, ఆలయ పూజారి ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి ప్రీతిపాత్రమైన అంబళ్లు సమర్పించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సికె లావణ్యబాబు విలేకరులతో మాట్లాడుతూ .... ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి చిత్తూరు నగరంలో నీటి కొరత రాకుండా చూడాలని, పంటలు బాగా పండి రైతులు చల్లంగా ఉండేలా కటాక్షించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఆలయ ధర్మకర్త మురుగేష్ మాట్లాడుతూ ప్రతి ఏటా గుండాలమ్మ జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ధర్మకర్త మురుగేష్ మాట్లాడుతూ గత 32 సంవత్సరాలుగా క్రమం తప్పకుండా అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలను ఎటువంటి ఆటంకాలు చోటుచేసుకోకుండా నిర్వహించడం జరిగాయన్నారు. అదే తరహాలో ఈ ఏడాది సైతం 33 వ జాతర మహోత్సవాన్ని అందరి సహాయ, సహకారాలతో ఘనంగా నిర్వహించడం జరుగుతోందని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా సాయంత్రం మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పిండి దివ్వెలతో అమ్మవారికి ప్రదక్షిణలు చేశారు. వీరికి జాతర నిర్వహణ కమిటీ ప్రతినిధులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాగా ఈ కార్యక్రమంలో జాతర నిర్వహణ కమిటీ ప్రతినిధులు చిత్తూరు ఘంటసాల రవినాయుడు, చిత్తూరు మున్సిపల్ మాజీ కార్పొరేటర్లు కృపానందం, ఆనంద్, గిరింపేట దుర్గమ్మ ఆలయ మాజీ చైర్మన్ విశ్వనాథ్, జనసేన పార్టీ సీనియర్ నాయకులు తులసి, మాజీ లేబర్ ఆఫీసర్ మణి, రాజశేఖర్, ఉమాపతి, మేస్త్రి మణితో పాటు, చిత్తూరు నగరం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**- కంగుంది గ్రామంలో వేరుశెనగ విత్తనాల పంపిణీ ప్రారంభం : ఏఎంసీ చైర్మన్ జె.ఎం. రాజు**



**కుప్పం, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు కుప్పం మండలం లోని కంగుంది గ్రామంలో రైతులకు వేరుశెనగ విత్తన కాయల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించినట్లు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ జె.ఎం. రాజు తెలిపారు. ఏఎంసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి.ఎస్. మునిరత్నం హాజరై రైతులకు విత్తన కాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కుప్పం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో వేరుశెనగ విత్తనాల పంపిణీని ప్రారంభించినట్లు తెలిపారు. మండలానికి మొత్తం 2,600 బ్యాగుల వేరుశెనగ విత్తనాల నిల్వ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఒక్కో బ్యాగ్ ధర రూ.3,060 కాగా, ప్రభుత్వం రూ.1,224 సబ్సిడీ అందజేస్తోందని, రైతులు కేవలం రూ.1,836 చెల్లించి విత్తనాలను పొందవచ్చని వివరించారు. ప్రస్తుతం వేరుశెనగ విత్తనాలకు అధిక డిమాండ్ ఉన్న నేపథ్యంలో నిజంగా సాగు చేసే రైతులు మాత్రమే విత్తనాలను తీసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. రైతులు ఈ విత్తనాలను పంట సాగుకు వినియోగించి, వచ్చే ఏడాది విత్తనాల కోసం అవసరమైన నిల్వ ఉంచుకుని, మిగిలిన వాటిని మాత్రమే విక్రయించాలని సూచించారు. అలాగే గుడుపల్లి, శాంతిపురం, రామకుప్పం మండలాల్లోని రైతు సేవా కేంద్రాలకు ఇంకా విత్తనాల సరఫరా పూర్తిగా చేరలేదని, త్వరలోనే అక్కడ కూడా పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ జె.ఎం. రాజు మాట్లాడుతూ, "రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం... రైతు అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తుంది. రైతులకు నాణ్యమైన విత్తనాలు, వ్యవసాయానికి అవసరమైన అన్ని సదుపాయాలను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, ఏఎంసీ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రభుత్వ సబ్సిడీతో విత్తనాలు అందుబాటులోకి రావడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు.

## త్వరలోనే నగరవనం ప్రారంభిస్తాం

**- కళ్యాణదుర్గం నగరవనాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ , ఎమ్మెల్యే**



**అనంతపురం, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కళ్యాణదుర్గం పట్టణం వద్దనున్న నగరవనాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పరిశీలించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలోని నగరవనం అంతా కలియదిరిగి పరిసరాలను జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ శాఖ ఆధ్వర్యంలోని నగరవనంను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కీంలో భాగంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కొంతకాలం నుంచి ఇక్కడ పనులు పూర్తి కావడం జరిగిందని, ఈరోజు స్థానిక ఎమ్మెల్యేతో కలిసి పరిశీలించడం జరిగిందని, త్వరలోనే నగరవనం ప్రారంభించేలా ప్రయత్నం చేస్తున్నామన్నారు. రాష్ట్ర మంత్రులతోగానీ, ఎమ్మెల్యేలతో కలిసి ఖచ్చితంగా ప్రారంభించేలా ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు. అంతేకాకుండా నగరవరంలో కాటేజీలు లేదా మిగిలిన వసతులు, సదుపాయాలు అవసరం ఉన్నట్లయితే డిఎంఎఫ్, విబిజి రాంజి స్కీంల కింద ప్రాథమిక మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, అభివృద్ధి చేయడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ రెండు పథకాలలో అదనంగా అవసరమైన మౌలిక సదుపాయాలను అటవీ శాఖతో సమన్వయం చేసుకొని కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

# చిత్తూరు జిల్లా

## అమర్నాథ్ గౌడ్ హత్యకు మూడేళ్లు

**-వైసీపీ పాలనలో దారుణ ఘటనలు - టీడీపీ నేతల విమర్శ**



**కుప్పం, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అమర్నాథ్ గౌడ్‌ను దారుణంగా హత్య చేసి మూడేళ్లు పూర్తికావస్తున్న సందర్భంగా కుప్పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంగళవారం పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ జి.ఎం.రాజు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమర్నాథ్ గౌడ్‌పై జరిగిన దారుణ హత్యను గుర్తు చేశారు. అమర్నాథ్ గౌడ్ తన అక్కను కొందరు ఆకతాయిలు వేధిస్తున్న విషయాన్ని అడ్డుకోవడంతో బాలుని పై కక్ష పెంచుకుని దాడికి పాల్పడ్డారని తెలిపారు. అనంతరం పెట్రోల్ పోసి అత్యంత దారుణంగా హత్య చేశారని ఆరోపించారు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిందన్నారు. వైసీపీ ప్రభుత్వ అండదండలతోనే ఇటువంటి ఘటనలు చోటుచేసుకున్నాయని విమర్శించిన వారు, బడుగు బలహీన వర్గాలకు అన్యాయాలు జరిగాయని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడంలో వైసీపీ పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. అలాగే వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు తన డ్రైవర్ హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న విషయాన్ని ప్రస్తావిస్తూ, ఆ ఘటన రాష్ట్ర రాజకీయాల్లో మచ్చగా మిగిలిందన్నారు. కరోనా సమయంలో వైద్యుడు డాక్టర్ సుధాకర్ ఎదుర్కొన్న పరిణామాలు కూడా ప్రజలు మరచిపోలేదని వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసును ప్రస్తావిస్తూ, ఆ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని ప్రోత్సహిస్తున్నారని ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు దెబ్బతిన్న కాలం వైసీపీ పాలనేనని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చట్టాన్ని కచ్చితంగా అమలు చేస్తోందని తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కూడా చట్టప్రకారం చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తప్పు చేసిన వారెవరైనా చట్టం ముందు సమానమేనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రతి వర్గానికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు టీడీపీ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సెల్వరాజు, రెస్కో డైరెక్టర్ ఆర్ముగం, 11వ క్లస్టర్ ఇంచార్జి కన్నన్ తదితర నాయకులతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## తాగునీటిని అందించండి



**పుంగనూరు,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మండల పరిధిలోని వనమలదిన్నె పంచాయతీ మేకనజామునపల్లి గ్రామ ప్రజలు మంగళవారం మాట్లాడుతూ... మా గ్రామంలో 65 కుటుంబాలు కలవని, గత రెండు నెలలుగా ప్రభుత్వం వారు గ్రామ నీటి సరఫరా కోసం ఏర్పాటుచేసిన బోరులో నీరు రాకపోవడంతో త్రాగు నీటి కోసం చాలా ఇబ్బందులు పడుతున్నామని, ఇదే విషయాన్ని అనేకమార్లు అధికారులకు తెలిపి ఉన్నామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మా ఊరికి త్రాగునీరు ఏర్పాటు చేయాలని కోరుతున్నామన్నారు. సంబంధిత అధికారులు స్పందించలేదంటే గ్రామస్తులు అందరూ కలసి కలెక్టర్కు లిఖితపూర్వకంగా తెలుపుతామన్నారు.

## అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



**పుంగనూరు,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్నంలోని స్థానిక ఎంసీవీ డిగ్రీ కాలేజ్ నందు ఫైర్ అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించి అక్కడున్న విద్యార్థుల కు మరియు అగ్నిప్రమాద ములు జరగక ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు అగ్ని ప్రమాదం జరిగిన తర్వాత చేపట్టవలసిన చర్యలు గురించి వివరించ డమైనది. ఏదైనా అగ్ని ప్రమాదాలు సంభవించిన తెలియపరచవల సిందిగా స్థానిక అగ్నిమాపక కేంద్రాధికారి ఎన్ .సుబ్బరాజు తెలియజేయడమైనది. ఈ కార్యక్రమంలో ఎంసీవీ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు, అధ్యాపకులు, మరియు ప్రిన్సిపాల్ పాల్గొనడం జరిగినది.

## రసాయన ఎరువులు వాడకం తగ్గింపుపై అవగాహన

**పలమనేరు,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పలమనేరు మండలం నందు రైతు సేవ కేంద్రం పరిధిలో రైతు సేవ కార్యక్రమంలో కేత బచావో కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కృషి విజ్ఞాన కేంద్రం కలికిరి నుండి ప్రిన్సిపల్ లక్ష్మీప్రసన్న, విచ్చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రసాయనకి ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులను జీలుగా జనుము వంటి పచ్చి రొట్టె ఎరువులు , అజిటోబక్టర్ , రైజో బియం నానో ఎరువుల వాడకంపై రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు . పలమనేరు మండల వ్యవసాయ అధికారి సంధ్య మాట్లాడుతూ.... రైతులందరూ తప్పనిసరిగా ఏపీఎంఎస్ 2.0 నందు నమోదు చేసుకుని తద్వారా తమ పంటకు అనుగుణంగా ఎరువులు తీసుకోవాలని సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు నీలిమ సాహెబ్,జిల్లా వన్ రూముల కేంద్రం వ్యవసాయ అధికారి మాధవి, రైతులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేని కలిసిన పెద్దపంజాణి ఎస్ఐ



**పలమనేరు, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండల నూతన సబ్ ఇన్స్పెక్టర్ (ఎస్ఐ)గా బాధ్యతలు స్వీకరించిన సురేష్ బాబు మంగళవారం స్థానిక ఎమ్మెల్యే అమరనాథ్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. చిత్తూరులో ఎస్ఐ గా విధులు నిర్వహించిన సురేష్ బాబు సోమవారం బదిలీపై పెద్దపంజాణి మండలానికి వచ్చారు.?బాధ్యతలు చేపట్టిన వెంటనే నియోజకవర్గ ప్రజా ప్రతినిధి అయిన ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా మండలంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యల పరిష్కారం తదితర అంశాలపై వారు చర్చించారు.

## వైసిపి నాయకులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్యే

**పలమనేరు, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** :పలమనేరు నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో భేటీ అయిన పలమనేరు మాజీ శాసనసభ్యులు వెంకటే గౌడ అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపి వారు వైయస్ ఆర్ సీపీ మద్దతుదారుల ఓట్ల తొలగింపుకు పాల్పడే అవకాశం ఉందని వారికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా అప్రమత్తంగా ఉండాలని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు అందేలా కృషి చేయాలని తప్పుడు లేదా అనర్హ ఓట్లను నిబంధనల ప్రకారం గుర్తించి తొలగింపు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. గతంలో పలమనేరు నియోజకవర్గంలో అనేక మంది ఓటర్ల పేర్లు తొలగించిన ఘటనలను గుర్తు చేస్తూ ఈసారి అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.పలమనేరు అర్బన్ గంగవరం మండలం పెద్దపంజాణి మండలం కన్వీనర్లు హేమంత్ కుమార్ రెడ్డి,బాగారెడ్డి, భాస్కర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు మురళీకృష్ణ, చెంగారెడ్డి, ప్రహల్లాద, శ్యాంసుందర్, నరేష్ ,కోదండ రామయ్య, రవి ,చంద్రప్ప, గిరి రాజారెడ్డి, పాల్గొన్నారు.

## ఏఐఎంఎస్ఆర్‌లో క్లినికల్ మీటింగ్ విజయవంతం

**- వైద్య విద్యలో మల్టీ డిసిప్లినరీ లెర్నింగ్‌కు దోహదం: డాక్టర్ నితిన్ ఎం. నాగర్‌కర్**





**చిత్తూరు, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వైద్య విద్యలో క్లినికల్ నైపుణ్యాలను పెంపొందించడం, మల్టీడిసిప్లినరీ అభ్యాసాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (ఏఐఎంఎస్ఆర్)లో నిర్వహించిన క్లినికల్ మీటింగ్ విజయవంతంగా ముగిసింది. ఆర్థోపెడిక్స్, పాథాలజీ విభాగాలు ఆసక్తికర కేసులను ప్రదర్శించగా, ది అపోలో యూనివర్సిటీ నియమిత వైస్ ఛాన్సలర్ డాక్టర్ నితిన్ ఎం. నాగర్‌కర్, అసోసియేట్ డీన్ (అకడమిక్స్) డాక్టర్ రమ్యా రామకృష్ణన్‌తో పాటు అధ్యాపకులు, హెచ్‌వోడీలు, పీజీ విద్యార్థులు, ఇంటర్న్లు పాల్గొని శాస్త్రీయ చర్చలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నితిన్ ఎం. నాగర్‌కర్ మాట్లాడుతూ.. క్లినికల్ మీటింగ్‌లు వైద్య విద్యలో కీలకమని, సీనియర్ల అనుభవాలు జూనియర్లతో పాటు అధ్యాపకులకు కూడా కొత్త విషయాలను నేర్చుకునే అవకాశాన్ని కల్పిస్తాయని చెప్పారు. మల్టీడిసిప్లినరీ లెర్నింగ్, పరిశోధనలపై అవగాహన పెంపొందించడంలో ఇటువంటి సమావేశాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. డాక్టర్ రమ్యా రామకృష్ణన్ మాట్లాడుతూ.. ఆర్థోపెడిక్స్, పాథాలజీ విభాగాలు ప్రదర్శించిన క్లినికల్ కేసులను శాస్త్రీయంగా వివరించిన తీరును అభినందించారు. విద్యార్థుల్లో క్లినికల్ విశ్లేషణా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి అకడమిక్ కార్యక్రమాలు ఉపయోగపడతాయని అన్నారు. క్లినికల్ మీటింగ్‌లో పాథాలజీ విభాగం తరపున 'మెడలో అసాధారణ సాఫ్ట్ టిష్యూ మాస్' అనే క్లిష్టమైన కేసును సీనియర్ రెసిడెంట్ డాక్టర్ పవిత్ర టి. ప్రదర్శించారు. ఈ సెషన్‌కు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతి బి. మోడరేటర్‌గా, ప్రొఫెసర్, విభాగాధిపతి డాక్టర్ పి. విజయ్‌కుమార్ ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు.

అలాగే ఆర్థోపెడిక్స్ విభాగం తరపున 'ఎడమ టిబియా వరా సమస్యకు మీడియల్ ఓపెన్ వెడ్జ్ ఆస్టియోటమీ ద్వారా చికిత్స' అనే అరుదైన కేసు నివేదికను పోస్ట్ గ్రాడ్యు యేట్ డాక్టర్ అఖిల్ సాయి ప్రదర్శించారు. ఈ కేసుకు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఆశిష్ మహ్మద్ అబ్దుల్ మోడరేటర్‌గా, ప్రొఫెసర్, విభాగాధిపతి డాక్టర్ ఎస్. హరి బాబు ఛైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. క్లినికల్ మీటింగ్‌ల సమన్వయకర్త డాక్టర్ వి. రాజేశ్‌కుమార్ కార్యక్రమ నిర్వహణను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్‌వోడీలు, అధ్యాపకులు, పీజీ విద్యార్థులు, ఇంటర్న్లు పాల్గొన్నారు.

# పండుగ వాతావరణంలో రెండేళ్ల విజయోత్సవ సభ

**- ప్రజారంజక పాలనపై సర్వత్రా ప్రశంసలు - తరలివచ్చిన కూటమి పార్టీల నేతలు,కార్యకర్తలు**
**- హాజరైన ఎమ్మెల్యే షాజహాన్ బాషా, పరిశీలకులు నెట్టెం వెంకటేష్**



**మదనపల్లె, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తిచేసున్న శుభసందర్భంలో మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి విజయోత్సవ సభ పట్టణంలోని శ్రీకృష్ణ కళ్యాణ మండలంలో పండుగ వాతావరణంలో జరిగింది. తెలుగుదేశం పార్టీ వివిధ హోదాలలో ఉన్న నేతలు హాజరు కాగా మహానాడు పరిశీలకులు నెట్టెం వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరుకాగా రామసముద్రం, నిమ్మనపల్లె, మదనపల్లె, మండలం పట్టణానికి చెందిన తెలుగుదేశం కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్ బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఏపీకి భారతదేశంలో గుర్తింపు వచ్చిందని తెలిపారు. గత ఐదేళ్ల అరాచక పాలన అంతం చేసి అధికారంలోకి వచ్చిన ప్రజాపాలన కొనసాగిస్తూ పెద్దలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్షేమ పథకాలతో పాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తున్నారని, మదనపల్లి నియోజకవర్గం లో పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. కూటమి పార్టీల నేతల సహకారంతో ఈనెల 20న ముఖ్యమంత్రి చంద్రబాబు మదనపల్లె పర్యటనను దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. మదనపల్లెను జిల్లా కేంద్రాన్ని ప్రకటించి మదనపల్లి ప్రజల 140 ఏళ్ల ఆకాంక్షలను నెరవేర్చారని ఆనందం వ్యక్తం చేశారు. కొట్లాది రూపాయలు హెచ్చించి మదనపల్లిలో రోడ్లు మెరుగుపరచడం జరిగిందని, మదనపల్లి దాహార్తిని తీర్చేందుకు త్వరలో సమ్మర్ స్టోరీస్ ట్యాంక్ పనులు పూర్తిచేసి ప్రతి ఇంటికి నీరు అందించేందుకు పనులు ప్రారంభించామని తెలిపారు. 20న ముఖ్యమంత్రి చంద్రబాబు మదనపల్లెలో పర్యటిం చనున్నారని ప్రజలు రైతులు మహిళలు విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చి ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పచ్చిపాల తులసి, చల్లపల్లి నరసింహారెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ నాదెళ్ల విద్యాసాగర్, రాటకొండ గుర్రప్ప నాయుడు, విజయభారతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఎన్. సేతు,జనసేన రామాంజనేయులు,ఏఎంసీ చైర్మన్ జంగాల శివరాం, దారం అనిత,టిడిపి సీనియర్ నాయకులు ఆర్.జె. వెంకటేష్ ఏఎంసి వైస్ చైర్మన్ ఆంజనేయులు,రామకృష్ణ ఆచారి, పఠాన్ ఖాదర్ ఖాన్,చేనేత విభాగం రాష్ట్ర నాయకులు బొమ్మిశెట్టి పురుషోత్తం, నాగూర్ వలి,ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు పోతపోలు సుధాకర్,బాలు స్వామి,టౌన్ ప్రెసిడెంట్ అరుణ్ తేజ్, అధ్యక్షులు దేవరింటి శ్రీనివాసులు, నిమ్మనపల్లె రాజన్న,తలారి రాధ,రాటకొండ భారతి, నాలుగో వార్డ్ జాఫరున్నిసా,పులి మహాలక్ష్మి, బైగారి భారతి నాయుడు, చంద్రశేఖర్ నాయుడు,డాన్స్ రెడ్డి,యర్రబల్లి వెంకటరమణారెడ్డి,మంగళ ప్రభాకర్, ఐటిడిపి నాయకులు సిబియన్ రెడ్డి శేఖర్,కాశి శ్రీరామ్ ప్రకాష్,పసుపులేటి శ్రీనివాసులు,ఎస్ఎం రఫీ,ఎస్ఏ మస్తాన్, విజయమ్మ,మల్లికార్జున నాయుడు,బోనాసి జాన్ బాబు,క్లస్టర్ ఇన్చార్జ్ రాజ్ కుమార్,కత్తి లక్ష్మన్న,నవీన్ చౌదరి, శివాలయం చైర్మన్ వెంకటరమణ, పెద్దఎత్తున తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా కంచర్ల ప్రమాణ స్వీకారం

**- పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపిన నాయకులు మాజీ సైనికులు**



**మదనపల్లె,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** డిఫెన్స్ వెటరన్స్ ఆర్గ నైజేషన్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులుగా కంచర్ల శ్రీనివాసులు నాయుడు ప్రమాణ స్వీకారం మహోత్స వం అట్టహాసంగా జరిగింది. మంగళ వారం బుగ్గ కాలువ ఎన్ వి ఆర్ కళ్యాణ మండపం నందు జరిగిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో రాజకీయ పార్టీ ల నాయకులు, మాజీ సైనికులు, సీనియర్ సిటిజన్స్, విశ్రాంత ఉద్యోగులు, ప్రజా ప్రతి నిధులు, అభిమానులు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డిఫెన్స్ వెటరన్స్ ఆర్గ నైజేషన్ ఫౌండర్, జాతీయ అధ్యక్షులు రామస్వామి, కంచర్ల శ్రీనివాసులు నాయుడు చే ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పలువురు నాయకులు, అభిమానులు, మాజీ సైనికులు, కంచర్ల శ్రీనివాసులు నాయుడు ను కలుసుకొని దుశ్శాలువా, పూలమాల, పుష్ప గుచ్ఛాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ కంచర్ల శ్రీనివాసులు నాయుడు మాజీ సైనికులకు, సమాజానికి అందిస్తున్న నిస్వార్థ సేవలను ప్రశంసించారు. జిల్లా పరిధిని ధాటి రాష్ట్ర వ్యాప్తంగా మాజీ రక్షణ దళాలకు రాష్ట్ర అధ్యక్షులుగా ఆయన నిస్వార్థంగా సేవలు అందించి అందరి అభిమానాన్ని చురగొంటారని పేర్కొన్నారు. మాజీ సైనికులకు ఎక్కడ ఎలాంటి సమస్య వచ్చిన, తానున్నానంటూ ముందుండి పోరాటం చేసి వారికి న్యాయం జరిగేలా చేయడంలో ఆయన సమయస్ఫూర్తి ఆదర్శనీయమని కొనియాడారు. మాజీ సైనికుల సమస్యల తో పాటు ప్రజాహితం కోసం ఆయన చేసిన సేవలు స్ఫూర్తిదాయక మన్నారు. అనంతరం కంచర్ల శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను, నిజా యితీతో, నిస్వార్థంగా నిష్కల్మషంగా నిర్వ హిస్తానని ప్రకటించారు. తన బాధ్యతలకు వన్నె తీసుకువచ్చే విధంగా సేవలు అందించడం తోపాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. తనకు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాటకొండ బాబు రెడ్డి, రాందాస్ చౌదరి, జంగాల శివరాం రాయల్, నరేష్ కుమార్ రెడ్డి, శ్రీరామ రామాంజ నేయులు, జింక వెంకటా చలపతి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు రెడ్డి సాహెబ్, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరాం చిన్నబాబు, మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతి, టిడిపి సీనియర్ నాయకులు అర్జె వెంకటేష్, రాటకొండ మధు బాబు తో పాటు కంచర్ల చింటూ, మాజీ సైనికులు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, అభిమానులు పాల్గొన్నారు.

## పోటా పోటీగా సౌత్ జోన్ క్రికెట్ అండర్ 16 బాలుర అంతర్ జిల్లాల పోటీలు

**వాల్మీకిపురం,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వాల్మీకిపురంలోని సిడిసిఏ - జీవీఎస్సిఎస్ క్రికెట్ గ్రౌండ్స్ లో జరుగుతున్న అండర్16 బాలుర 3 రోజుల మల్టీ డే టెస్టు మ్యాచ్ పోటీలో గ్రౌండ్ ఎలో కర్నూలు మరియు నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 258 పరుగులు చేసి ఆల్ ఔట్ అయినది. ఇందులో రుత్విక్ 159 బాల్స్ లో 96 పరుగులు, వివేక్ 57 బాల్స్ లో 57 పరుగులు చేశారు. నెల్లూరు జిల్లా బౌలర్లు సాయి చరణ్ 3 వికెట్ లకు 39 పరుగులు, సుశాంత్ 3 వికెట్ లకు 61 పరుగులు ఇచ్చారు. తరువాత బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 218 పరుగుల కు ఆల్ ఔట్ అయినది. ఇందులో కర్నూలు జిల్లా బౌలర్ గంగాద్రి 3 వికెట్ లు తీసి 61 పరుగులు ఇచ్చారు. కర్నూలు జట్టు తరువాత రెండవ ఇన్నింగ్స్ లో బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు 276 పరుగులు 8 వికెట్లుకు 85.5 ఓవర్లలో చేసి డిక్లేర్ చేసింది. ఇందులో ఎ . నిశాంత్ రెడ్డి 135 పరుగులు 226 బంతుల్లో చేశారు. నెల్లూరు రెండవ ఇన్నింగ్స్ లో 135/3 35.5 ఓవర్లలో చేసింది. ఇందులో జీ. బెన్ యాన్ 51 పరుగులు 77 బంతుల్లో, సాయి యశ్వంత్ 52 పరుగులు 78 బంతుల్లో చేశారు.దీ గ్రౌండ్ లో కడప, అనంతపురం జట్ల మధ్య మ్యాచ్ జరగగా కడప జట్టు మొదటి ఇన్నింగ్స్ లో మొదట బ్యాటింగ్ చేసి 63.3 ఓవర్లలో 316 పరుగులు చేసి ఆల్ ఔట్ అయినది తరువాత అనంతపురం జట్టు 65.5 ఓవర్ లలో 288 పరుగులకు ఆల్ అవుట్ అయినది.. ఇందులో అనంతపురం జట్టు ప్లేయర్ పంకజ్ మీనా 161 బాల్స్ లో 118 పరుగులు, చేయగా కడప జట్టు బౌలర్ వర్సిత్ కుమార్ 7 వికెట్లు తీసి 62 పరుగులు ఇచ్చారు . కడప జట్టు రెండో ఇన్నింగ్స్ లో 80.4 ఓవర్లలో 8 వికెట్లు కు 471 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. ఇందులో ఏండీ ఫైజాన్ 149బాల్స్ లో 126 పరుగులు, సాయి కృష్ణ చైతన్య 215 బాల్స్ లో 191 పరుగులు చేశారు.

తరువాత 500 పరుగులు లక్ష్యంతో బరిలో దిగిన అనంతపురం జట్టు తన రెండో ఇన్నింగ్స్ లో 255 పరుగులుకు 51.2 ఓవర్ లలో ఆల్ ఔట్ అయింది. ఇందులో ఆదినారాయణ 88 పరుగులు 121 బంతుల్లో, ప్రణధీర్ 51 పరుగులు 73 బంతుల్లో చేశారు.దీంతో కడప 244 పరుగుల తేడాతో విజయం సాధించింది కడప బౌలర్లలో వర్షిత్ కుమార్ 6/62 తీసుకోవడం జరిగిందని సీ డీ సీ ఏ వైస్ ప్రెసిడెంట్ శ్రీధర్ కుమార్ తెలిపారు. పోటీలని చీఫ్ కోచ్ సునీల్ కుమార్ పర్యవేక్షించారు.

## వెలుగు చిన్నారులు,సిబ్బందికి విలేజ్ రెస్టారెంట్ యజమాని విందు

**- స్నేహిత పుట్టినరోజు వేళ తులసీరామ్ గొప్ప మనసు**

**మదనపల్లె,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వెలుగు సంస్థలోని దివ్యాంగులు మరియు వృద్ధులకు తులసిరాం తన శ్రేయోభిలాషి అయిన స్నేహిత పుట్టినరోజు వేళ పుంగనూరు రోడ్ నందు గల తన విలేజ్ రెస్టారెంటులో విందు ఏర్పాటు చేసి గొప్పమనసు చాటుకున్నారు.ముందుగా వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో దివ్యాంగులకు,వృద్ధులకు విందు భోజనం వడ్డించారు.అనంతరం అందరి సమక్షంలో కేక్ కట్ చేయగా అందరు కలిసి స్నేహితకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా తులసీ రాం మాట్లాడుతూ మా శ్రేయోభిలాషి అయిన స్నేహిత జన్మదినాన్ని మీ అందరి మధ్యలో జరుపుకోవడం మాకెంతో సంతోషంగా ఉందని,ప్రతి సంవత్సరం జూన్ 15వ తేదీన వెలుగు సంస్థలో భోజనాలు ఏర్పాటు చేస్తామన్నారు.అనంతం వెలుగు సెక్రటరీ యం.ఉదయ్ మోహన్ రెడ్డి మాట్లాడుతూ స్నేహిత జన్మదిన వేడుక సందర్భంగా మా అందరికి భోజనాలు ఏర్పాటు చేసిన తులసి రాంకి మరియు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## దివ్యాంగులకు కృత్రిమ కాళ్ల అమరిక శిబిరం

**- ఆదర్శ ప్రత్యేక ప్రతిభావంతుల సేవా సమితి పిలుపు**



**పీలేరు, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వై.ఎస్.ఆర్ కడప మరియు అన్నమయ్య జిల్లాల్లోని దివ్యాంగుల కోసం జులై 2026 నెలలో ఉచిత ఆధునిక వెయిట్‌లెస్ కృత్రిమ కాలు అమరిక 'అమరిక శిబిరం' నిర్వహించ బడుతుందని ఆదర్శ ప్రత్యేక ప్రతిభావంతుల సేవా సమితి అధ్యక్షులు పి.వి.చలపతి, కార్యదర్శి కే. వి. రమణ ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 51,000/- విలువైన ఈ అత్యాధునిక కృత్రిమ కాళ్లను అర్హులైన దివ్యాంగులకు పూర్తిగా ఉచితంగా అందించడం జరుగుతుందని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రెండు జిల్లాల్లోని అర్హులైన ప్రతిభావంతులు (దివ్యాంగులు) ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పేరు నమోదు మరియు సంప్రదింపులకై ఫోన్ నంబర్లు: వివరాల నమోదు కోసం క్రింది ప్రతినిధులను సంప్రదించవచ్చు:బి.ఎం హుస్సేన్ / డి . రమేష్, మొబైల్ నంబర్లు: 8074623993, 9182778324, 9701733292, ల్యాండ్ లైన్ నంబర్: 08562-295480.


## ఎమ్మార్వోను కలిసిన టిడిపి నాయకులు



**ములకలచెరువు , జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తంబళ్లపల్లె నియోజకవర్గం, ములకలచెరువు మండలం నూతన ఎమ్మార్వో రెడ్డన్నను ను ములకలచెరువు టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో రెడ్డన్నకు పూలమాలవేసి దుశ్శాలతో సన్మానించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలపై స్పందించి ప్రజలకు ఎప్పటికప్పుడు పరిష్కారం న్యాయం చేయాలని కోరారు. తన దృష్టికి వచ్చే రెవెన్యూ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి ప్రజలకు అందుబాటులో ఉండి న్యాయం చేస్తానని తాసిల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కెవి.రమణ, మాజీ ఎంపీటీసీలు నరసింహా రెడ్డి, మూగి రవిచంద్ర, చాంద్ భాషా, రమణా రెడ్డి,గ్రామకమిటి అధ్యక్షులు రెడ్డెప్ప, శ్రీనివాసులు, మునిస్వామి, నాగి రెడ్డి ,రాము, యూనిట్ ఇంచార్జిలు ఎగవింటి శంకర,గణేష్ ,వెంకటమల్లు, రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

## మిట్స్ వర్సిటీలో బయో ఇన్ఫర్మేటిక్స్ ప్రవేశాలకు అవకాశం

**- బయాలజీ విద్యార్థులకు సువర్ణావకాశం - రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ వెల్లడి**



**మదనపల్లె/ కురబలకోట,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ పూర్తి చేసిన బయాలజీ అయిన (బై.పీ.సి/ఏం బై.పీ.సి/పిసిఏంబి మరియు ఎం.పీ.సి) విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బి.టెక్ బయోఇన్ఫర్మాటిక్స్ కోర్సులో ప్రవేశాలను ఆహ్వానిస్తున్నట్లు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జీవశాస్త్రం,కంప్యూటర్ సైన్స్ మరియు డేటా అనలిటిక్స్ రంగాల సమ్మేళనంగా అభివృద్ధి చెందుతున్న బయోఇన్ఫర్మాటిక్స్ కోర్సుకు దేశ విదేశాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు.ఈ కోర్సు ద్వారా విద్యార్థులు జీనోమిక్స్, బయోటెక్నాలజీ,ఆరోగ్య సంరక్షణ,ఔషధ పరిశోధనలు,కృత్రిమ మేధస్సు ఆధారిత జీవశాస్త్ర అనువర్తనాలు వంటి ఆధునిక రంగాల్లో నైపుణ్యాలను సంపాదించవచ్చన్నారు.అదేవిధంగా బీసీఏ (బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్) మరియు బీబీఏ (బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్) కోర్సులలో కూడా ప్రవేశాలు కొనసాగుతున్నాయని తెలిపారు.అర్హత కలిగిన విద్యార్థులు మరియు తల్లిదండ్రులు విశ్వవిద్యాలయ ప్రవేశాల కోసం యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని లేదా 7330803555, 73308 52555 నెంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.



# అన్నమయ్య జిల్లా


## హోంమంత్రిపై మాజీ మంత్రి వ్యాఖ్యలు అభ్యంతరకరం

**- గుడివాడ అమరనాథ్ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలి**
**- తెలుగుదేశం నేత నాగూర్ వలి డిమాండ్**



**మదనపల్లె, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు అలుపెరుగని కృషిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ హోంమంత్రి వంగలపూడి అనితపై వైసీపీ నాయకుడు,మాజీ మంత్రి గుడివాడ అమరనాథ్ వ్యాఖ్యలు అభ్యంతరకరమని తెలుగుదేశం యువనేత,ఆర్టీసీ 1,2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్ వలి (షో ఆప్ శీను) ఆరోపించారు.ఈ సందర్భంగా మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సాధారణ ఉపాధ్యాయురాలిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన అనిత నేడు రాష్ట్ర హోంమంత్రిగా ఎదిగారంటే ఆమె పట్టుదలను గుర్తించాలన్నారు.రాష్ట్ర హోంమంత్రి అనిత వస్త్ర అలంకరణ,ఆమె మేకప్ గురించి మాట్లాడడం మహిళలను కించపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.గత శాసనసభ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెప్పినా వైసీపీ నాయకులకు ఇంకా బుద్ధి రాలేదని విమర్శించారు.టిడిపి మహిళ రాష్ట్ర అధ్యక్షురాలిగా,పోలిట్ బ్యూరో సభ్యురాలిగా సమర్థవంతంగా పనిచేసే ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రశంసలు అందుకున్నారన్నారు.2024 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించిన తర్వాత ఆమెకు హోంమంత్రి బాధ్యతలు అప్పగించడం అనిత పనితీరుకి నిదర్శనన్నారు.రాష్ట్ర హోం మంత్రిగా చక్కని పనితీరును కనబరుస్తూ రాష్ట్రంలో నేరాల నియంత్రణపై దృష్టి సారించారన్నారు. గంజాయి,డ్రగ్స్,మాదక ద్రవ్యాలపై ఉక్కు పాదం మోపుతూ శభాష్ అనిపించుకుంటున్నారన్నారు.ఇటువంటి మహిళా నేతపై విమర్శలు చేయడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.వైసీపీ నేతలు చందమామలో మచ్చలను వెతుకుతున్నారని,ప్రజలు అందులో వెలుతురును చూస్తున్నారని వెల్లడించారు.2029లో తాము అధికారంలోకి వస్తే అని వైసిపి నేతలు ప్రగల్భాలు పలుకుతున్నారని,2029లో కాదుకదా 2039,2049లో సైతం వారికి అధికారం భ్రమే అని ఎద్దేవా చేశారు.వైసిపి నేతలు ఇప్పటికైనా తమ తీరును మార్చుకోవాలని,మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు.

## కంచర్లను సన్మానించిన మాజీ సర్పంచ్ చలపతి



**మదనపల్లె, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ మాజీ రక్షణ దళాల రాష్ట్ర అధ్యక్షులుగా కంచర్ల శ్రీనివాసులు నాయుడు ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం ఎన్.వి.ఆర్ కళ్యాణ మండపంలో ఘనంగా జరిగింది.ఈ ప్రమాణ స్వీకార మహోత్సవం కు.. కురవంక మాజీ సర్పంచ్ పసుపులేటి చలపతి హాజరై శ్రీనివాసులు నాయుడుని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పసుపులేటి చలపతి మాట్లాడుతూ గతంలో దేశ రక్షణలో,ప్రస్తుతం సమాజ సేవలో శ్రీనివాసులు నాయుడు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారన్నారు.మాజీ సైనికుల సంఘం డివిజన్ అధ్యక్షుడిగా మాజీ సైనికులకు అండగా నిలిచారని,వారి పక్షాన అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు.అదేవిధంగా మదనపల్లెలో హిందూ స్మశాన వాటిక పరిరక్షణకు ఆయన తనదైన కృషి చేశారన్నారు.అందరినీ ఆప్యాయంగా పలకరించే మనస్తత్వం కలిగిన శ్రీనివాసులు నాయుడు మాజీ రక్షణ దళాల రాష్ట్ర అధ్యక్షులుగా ఎంపిక కావడం హర్షణీయమన్నారు.రక్షణ దళాలలో పనిచేసిన మాజీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఆయన అంకితభావంతో పనిచేస్తారని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో యువ నాయకుడు కంచర్ల చింటూ,మాజీ వార్డు మెంబర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి జ్ఞాపకార్థం అన్నదానం

**- పేదల ఆకలి తీర్చిన దలవాయి సోదరులు**



**పీలేరు, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** దివంగత నేతల జ్ఞాపకాలను సేవా కార్యక్రమాలతో సజీవంగా నిలుపుతున్నారు టీడీపీ నాయకులు. పీలేరు పట్టణ అధ్యక్షులు దలవాయి సురేష్ కుమార్ రెడ్డి ఏ కంచి సూరి తమ సోదరుడు దలవాయి బాలాజీ రెడ్డి తండ్రి దలవాయి వాసుదేవ రెడ్డి 12వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న అన్న క్యాంటీన్‌లో కంచి సూరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మంది నిరుపేదలు, వృద్ధులు, యాచకులు, కూలీలు పాల్గొని భోజనం చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్నదానం నిర్విరామంగా కొనసాగింది.ఈ సందర్భంగా కంచి సూరి మాట్లాడుతూ "బాబాయ్ బతికున్న రోజుల్లో ఎప్పుడూ పేదలకు అండగా నిలిచేవారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మా బాధ్యత. ఆయన వర్ధంతి రోజున ఇలా అన్నదానం చేయడం ద్వారా ఆయన ఆత్మకు శాంతి చేకూరుతుందని నమ్ముతున్నాం. ఆకలితో ఉన్న వాడికి అన్నం పెట్టడం కంటే పుణ్యం మరొకటి లేదు. మా బాబాయ్ గారి ఆశీస్సులు మాపై ఎప్పుడూ ఉంటాయని అన్నారు.అన్నదాన కార్యక్రమంలో అన్న దాన కార్యక్రమానికి వచ్చిన వారంతా దివంగత నేత దలవాయి వాసుదేవ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు జయచంద్రారెడ్డి,ఏషామియాన జయన్న, దేవులపల్లి చంద్రశేఖర్ రెడ్డి,ఏడి సి ఆర్, శేఖర టీడీపీ నాయకులు, కార్యకర్తలు, దలవాయి కుటుంబ అభిమానులు, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేద్దాం



**ఒంటిమిట్ట, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**పర్యాటక రంగ అభివృద్ధికి అందరం కృషి చేద్దా మని ఒంటిమిట్ట మండల విద్యా శాఖాధికారి డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. మంగళ వారం ఆయన ఒంటిమిట్ట కోదండ రామాలయం సందర్శించినపుడు అక్కడి యాత్రికులు ఆలయ ప్రాంగ ణంలో శిల్ప కళను ఆసక్తిగా గమ నించడం చూసి వారికి ఆలయ ప్రాశస్త్యం గురించి , శిల్పకళా వైభవం గురించి తెలియజేశారు. తూర్పు ముఖ ద్వారం అధిష్టానం మీద ఉన్న వృషభ కుంజరం మరియు సీతారామ కళ్యాణం లాంటి ప్రసిద్ధి చెందిన శిల్పాల గురించి పర్యాటకులకు చక్కగా వివరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పర్యాట కుల ఆసక్తిని గమనించి వారికి ఆలయం ఆలయ శిల్పకళా విశిష్టతను వివరించారు. ప్రతి స్థానికులు ఇలా అవకాశం వచ్చినపుడు ఆయా ప్రాంతాలకు వచ్చే భక్తులకు, పర్యాటకులకు మన ప్రాంతం విశిష్టతను తెలియ జేసేవిధంగా ఉండాలని, తద్వారా పర్యాటక రంగ అభివృద్ధికి , ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి కృషిచేసినట్లు అని అన్నారు. అనంతరం కోదండ రామస్వామిని దర్శించుకొన్నారు. ఈ కార్యక్రమంలో వైవియు లలిత కళల విభాగాధిపతి ఆచార్య కోట మృత్యుంజయ రావు, రాయల సీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటి ప్రధాన కార్యదర్శి కొండూ రు జనార్దన రాజు, పర్యాటక ఫోటోగ్రాఫర్ గొబ్బూరి కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## దుర్గగుడిలో అక్రమ దర్శనాల దందా

### : హోంగార్డుపై క్రిమినల్ కేసు నమోదు



**విజయవాడ , జూన్16 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఇంద్రకీలాద్రిపై వెలిసిన కనకదుర్గమ్మ ఆలయంలో భక్తుల నమ్మకాలను సొమ్ము చేసుకుంటున్న ఓ హోంగార్డు బాగోతం కలకలం రేపింది. సామాన్య భక్తుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ, నిబంధనలకు విరుద్ధంగా అంతరాలయ దర్శనాలు చేయిస్తున్న సదరు హోంగార్డుపై నగర పోలీస్ కమిషనర్ ఎస్. వి. రాజశేఖర బాబు కఠిన చర్యలు తీసుకున్నారు.ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న ఈ అక్రమాలపై దుర్గగుడి ఈవో సేన నాయక్ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఉన్నతాధికారులు లోతుగా విచారణ జరిపారు. హోంగార్డు అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆధారాలతో సహా ఆరోపణలు రుజువు కావడంతో, వన్ టౌన్ పోలీసులు అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు.పవిత్రమైన పుణ్యక్షేత్రంలో భక్తుల విశ్వాసాలను దెబ్బతీసేలా ప్రవర్తించిన సదరు సిబ్బందిపై శాఖాపరమైన చర్యలకు కూడా ఆదేశించారు. భక్తుల భద్రత, సేవల్లో ఇలాంటి అవినీతి చర్యలను ఎంతమాత్రం సహించబోమని, నిందితులపై కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభం

### : భయాందోళనలో గుణదల ప్రజలు



**విజయవాడ , జూన్16 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విజయవాడ, గుణదల: విజయవాడ గుణదలలోని ప్రభుత్వ దంత వైద్య కళాశాల (డెంటల్ కాలేజీ) నుంచి లయోలా కాలేజీకి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న ఒక విద్యుత్ స్తంభం తీవ్ర ప్రమాదకర స్థితికి చేరింది. ఈ స్తంభం ఒకవైపుకు పూర్తిగా వంగిపోయి, ఏ క్షణంలోనైనా కూలిపోయేలా ఉండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.ఈ మార్గం నిత్యం వేలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజల రాకపోకలతో ఎంతో రద్దీగా ఉంటుంది. భారీ ఈదురు గాలులు లేదా చిన్నపాటి ప్రమాదం జరిగినా ఈ స్తంభం కూలిపోయే ముప్పు పొంచి ఉంది. అదే గనుక జరిగితే పెద్ద ఎత్తున ప్రాణనష్టం, ఆస్తి నష్టం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు."ఈ దారిలో రోజూ వందలాది మంది విద్యార్థులు నడుచుకుంటూ వెళ్తుంటారు. అధికారులు ఏదైనా ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా, తక్షణమే స్పందించి ఈ వంగిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి, కొత్తది ఏర్పాటు చేయాలి" అని స్థానిక నివాసితులు డిమాండ్ చేస్తున్నారు.

## వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాల్వ



**రాయదుర్గం జూన్16 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గుమ్మఘట్ట మండలం సిరిగేదొడ్డి గ్రామంలో రైతులకు ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు వేరుశెనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఖరీఫ్ సీజన్‌లో మంచి దిగుబడులు సాధించేలా అవసరమైన విత్తనాలు, సాంకేతిక సూచనలు సకాలంలో అందించేందుకు కృషి చేస్తున్నామని, రైతుల అభివృద్ధి, వ్యవసాయ రంగ బలోపేతానికి కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

## కూటమి మహాసభకు హాజరైన బీకే పార్థసారథి



**హిందూపురం జూన్16 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** హిందూపురం పార్లమెంటు సభ్యులు బికే పార్థసారథి మంగళవారం పుట్టపర్తిలోని పోలీస్ మైదానంలో ఏర్పాటుచేసిన కూటమి మహాసభకు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కూటమి రెండేళ్ల పాలనలో ప్రజలకు అందిస్తున్న పథకాలు, సంక్షేమ పాలన గురించి వివరించారు.

## గంజాయి కేసులో 8 మంది అరెస్టు



**నిడదవోలు జూన్16 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నిడదవోలు పట్టణంలో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురితో పాటు కొనుగోలు చేసేందుకు వెళ్లిన మరో ఐదుగురిని అరెస్టు చేసినట్లు నిడదవోలు సీఐ పీవీజీ తిలక్ తెలిపారు. మంగళవారం నిడదవోలు సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ.. హుక్కుంపేటకు చెందిన తలాడ సాయి అజయ్, నిడదవోలు మండలం సమిశ్రగూడేనికి చెందిన షేక్ రహీం, మహమ్మద్ సలీం గంజాయిని తీసుకువచ్చి ఈనెల 15న నిడదవోలు పట్టణంలోని శశి స్కూల్ సమీపంలోని రహదారిలో విక్రయిస్తుండగా 500 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశామన్నారు. అదేవిధంగా గంజాయి సేవిస్తున్న మరో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 100 గ్రాములు గంజాయి, వెయ్యి రూపాయల నగదు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

## అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే సురేంద్రబాబు



**కళ్యాణదుర్గం జూన్16 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన విజయోత్సవ వేడుకలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏపీ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీ పూర్తి సహకారం అందిస్తున్నారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రాధాన్యతగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కళ్యాణదుర్గం మున్సిపాలిటీలో ప్రతి ఇంటికి కుళాయి వేసి తాగునీరు అందించే పథకానికి త్వరలోనే భూమిపూజ చేయనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

## ముగిసిన యోగ పోటీలు...



**మచిలీపట్నం జూన్16 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** యోగేంద్ర కార్యక్రమంలో భాగంగా జిల్లాలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ నేతృత్వంలో వివిధ రకాల యోగా పోటీలు నేటితో విజయవంతంగా ముగిశాయి. ఈనెల 7 తేదీ నుండి గ్రామస్థాయిలో, 10వ తేదీ నుండి మండల స్థాయిలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో యోగ పోటీలు నిర్వహించారు. ఈనెల 14 తేదీన మొదలైన జిల్లా స్థాయి పోటీలు 16వ తేదీ మంగళవారంతో ముగిశాయి. జిల్లా స్థాయిలో నగరంలోని జెడ్పీ కన్వెన్షన్ హాలులో జూనియర్లు, యువతీ యువకులు, వయోవృద్ధుల విభాగాలలో యోగా పోటీలు నిర్వహించారు. మూడవ రోజు జిల్లా స్థాయి పోటీలలో యోగా పాటలు, నినాదాలు,వ్యాసరచన, ఛాయాచిత్రాలు, క్విజ్ అంశాలపై జూనియర్, సీనియర్ల విభాగాలలో పోటీలు నిర్వహించారు. యోగ పోటీలు పాటల అంశంలో జూనియర్ భాగంలో యు రామకుమారి, సీనియర్ల విభాగంలో ముదిగొండ శాస్త్రి విజేతలుగా నిలిచారు. నినాదాలు అంశంలో జూనియర్ల విభాగంలో బి ప్రత్యూష, వ్యాసరచన అంశంలో జూనియర్ల విభాగంలో ఎన్ సరిత, ఛాయాచిత్రాల అంశంలో జూనియర్ విభాగంలో పి నాగమణి, క్విజ్ అంశంలో జూనియర్ విభాగంలో యు రామకుమారి విజేతలుగా ఎంపికయ్యారు. అన్ని అంశాలలోనూ సీనియర్ విభాగంలో ముదిగొండ శాస్త్రి ప్రతిభ చూపి విజేతగా నిలవడం చెప్పుకోదగ్గ విశేషం. ఈ యోగా పోటీలకు న్యాయ నిర్ణయితలుగా జి కృష్ణ, మద్దాల చింతయ్య, ఎన్ వి ఆర్ భాష్యం, యు. కార్తీక్, ఆర్ డి ప్రసాద్ వ్యవహరించారు. యోగా పోటీలను ఆయుష్ అధికారులు డాక్టర్ వాహిని, డాక్టర్ మానస, డాక్టర్ సుమిత్ర, డాక్టర్ రత్నకుమారి పర్యవేక్షించారు.

## హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి

### ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని పోలీసుల సూచన



**మచిలీపట్నం జూన్16 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారుల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంపొందించేందుకు కృష్ణా జిల్లా పోలీసులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ వి. విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు బందరు సబ్ డివిజన్ ఇన్‌చార్జి డీఎస్పీ జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బందరు ట్రాఫిక్ సీఐ సున్నా రాజు నేతృత్వంలో మచిలీపట్నం లక్ష్మీ టాకీస్ సెంటర్ వద్ద హెల్మెట్ వినియోగం, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు వాహనదారులకు పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, హెల్మెట్ ప్రమాద సమయంలో ప్రాణ రక్షణకు ఎంతగానో ఉపయోగ పడుతుందని వివరించారు. వాహనం నడుపుతూ సెల్‌ఫోన్ వినియోగిం చడం, అతివేగంగా ప్రయాణించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలు ప్రమాదాలకు కారణమవుతాయని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరి భద్రత కోసం రూపొందించబడ్డాయని, రహదారిపై ప్రయాణించే సమయంలో ఇతరుల భద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని పోలీసులు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా సిగ్నల్స్ పాటించడం, వాహన పత్రాలు సక్రమంగా ఉంచుకోవడం, జాగ్రత్తగా డ్రైవింగ్ చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా రహదారులపై పశువులను వదిలివేయడం వల్ల వాహనదారులకు ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందని పోలీసులు హెచ్చరించారు. పశువుల యజమానులు తమ పశువులను నియంత్రణలో ఉంచి రోడ్లపైకి రాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బందరు ట్రాఫిక్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొని వాహనదారులకు రోడ్డు భద్రత, హెల్మెట్ ప్రాముఖ్యత, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రమాదాల నివారణకు సహకరించాలని పోలీసులు కోరారు. హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా తమ ప్రాణాలను మాత్రమే కాకుండా ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

## కూటమి వచ్చాకే పల్నాట ప్రగతి పరుగులు



**నరసరావుపేట జూన్16 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కూటమి ప్రభుత్వం వచ్చాకే పల్నాడు జిల్లాలో ప్రగతి పరుగులు పెడుతోందని ప్రజాప్రతినిధులు ఉద్ఘాటించారు. సూపర్-6 పథకాల స్టాళ్ల ప్రదర్శన.. లబ్ధిదారుల అభిప్రాయాలు.. ప్రజాప్రతినిధుల ప్రసంగాలు.. కార్యకర్తల కోలాహలం నడుమ నరసరావుపేట పోలీసు కవాతు మైదానంలో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' జిల్లాస్థాయి విజయోత్సవ సభ విజయవంతమైంది. మొదట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు చదలవాడ అరవిందబాబు, ప్రత్తిపాటి పుల్లారావు, భాష్యం ప్రవీణ్, కన్నా లక్ష్మీనారాయణ, యరపతినేని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందారెడ్డి, తెదేపా జిల్లా అధ్యక్షుడు జాన్‌సైదా, భాజపా జిల్లా అధ్యక్షుడు శశికుమార్, జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ర్యాలీగా సభకు చేరుకున్నారు. అనంతరం సూపర్-6 పథకాల స్టాళ్లను తిలకించారు. చివరిగా వేదికపైకి చేరుకుని రెండేళ్లలో జిల్లాలో చేసిన అభివృద్ధి, సూపర్-6 పథకాల అమలుపై ప్రసంగించారు. సభ అనంతరం ఇన్‌ఛార్జి మంత్రి చేతుల మీదుగా రాయితీపై 12 ఆటోలు, 6 ట్రాక్టర్లు, 8 ఎగ్‌మార్టులు, 5 వీల్ ఛైర్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రైతులకు సబ్సిడీపై ట్రాక్టర్లు, బిందుసేద్య పరికరాలు, డీఆర్‌డీఏ వెలుగు ఆధ్వర్యంలో ఆటోలు అందజేశారు. 386 మహిళా సంఘాలకు మంజూరు చేసిన 105.50 కోట్ల రుణం, ఉద్యాన రైతులకు పలు పథకాల కింద ప్రభుత్వం అందించిన రాయితీ రూ.33.55 కోట్ల విలువైన చెక్కులు అందించారు.

## వ్యాధుల నివారణకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక చర్యలు



**కోటనందూరు జూన్16 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** విద్యార్థుల ఆరోగ్య దృష్ట్యా దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులను అరికట్టేందుకు వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా మలేరియా అధికారి ఐ.ప్రభాకర్ అన్నారు. అల్లిపూడిలోని కేజీబీవీలో యూనిట్ అధికారులు మధు, ఎర్రబ్బాయిలతో కలిసి మంగళవారం దోమల నివారణకు తీసకుంటున్న చర్యలపై ఆరా తీశారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల నివారణకు పాఠశాలలో చేస్తున్న దోమల మందు పిచికారీని పరిశీలించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై ప్రిన్సిపల్ రాజేశ్వరితో కలిసి ఉపాధ్యాయులు, విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆరోగ్య సహాయకుడు రాంబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

### : నాగదుర్గవరప్రసాద్ ఆర్థిక సాయం



**పాలకొల్లు జూన్16 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పాలకొల్లులోని GVSVRM స్కూల్లో మంగళవారం విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. పాటపళ్ళ నాగదుర్గవరప్రసాద్ ఆర్థిక సౌజన్యంతో 1 నుంచి 5 తరగతుల విద్యార్థులకు ఏటా ఈ సామగ్రిని అందిస్తున్నారు. విద్య ప్రతి విద్యార్థి హక్కు అని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో ఎవీ రాయపూడి భావనీ ప్రసాద్, టీచర్లు మధుసూదన్ రెడ్డి, నందిని, లీలాకుమారి, మమత తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య మెరుగుదలకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి...!

స్వచ్ఛమైన తాగునీరు ప్రతిరోజు ఇవ్వాలి

రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలి

బెలగాం అగ్రహారం వీధిలో వార్డుబాట నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**పార్వతీపురం జూన్16 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురం తో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాలలో పారిశుధ్య మెరుగుదలకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ డిసిసి జిల్లా అధ్యక్షులు వంగల దాలినాయుడు, పార్వతీపురం మండల అధ్యక్షులు బంకురు ప్రకాష్, ఏవో గంట మోహన్ రావు, ఓబీసీ నియోజకవర్గ ఛైర్మన్ వెలమల రాజశేఖర్, కురుపాం మండల అధ్యక్షులు మీసాల ఫ్రాన్సిస్, యువజన నాయకులు పాలక సంపత్ కుమార్ తదితరులు పార్వతీపురం మున్సిపాలిటీలోని బెలగాం అగ్రహారం వీధిలో వార్డుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. రానున్న రోగాల సీజన్ కు జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలో పారిశుధ్య మెరుగుదలకు చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే ప్రజలు దోమల బారిన పడి జ్వరాల పాలవుతున్నారన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలు గూర్చి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో స్వచ్ఛమైన పాలన అందించే కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా అక్కడ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో దోమల బెడద అధికంగా ఉందని ప్రజలు వాపోయారు. వారానికి ఒక రోజు వచ్చే కొళాయి నీటితో ఇబ్బందులు పడుతున్నామన్నారు. విసుకు మిసుకు, మిసుకు మనే వీధిలైట్లు తో ఇబ్బందులు పడుతున్నామన్నారు. బెళగాం ప్రాంతంలోని పలుచెరువులు కబ్జాకు గురయ్యాయన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఆక్రమణలకు గురైన కోట్లాది రూపాయలు విలువ చేసే చెరువులను రక్షించాలని కోరారు. చెరువులకు సర్వే చేసి బౌండరీలు నిర్మించాలాన్నారు. పట్టణ ప్రజలకు ప్రతిరోజు స్వచ్ఛమైన తాగునీటిని అందవ్వాలన్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి అగ్రహారం వీధిని వేధిస్తున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. కుళాయి గోతుల సమస్యను పూర్తిగా పరిష్కరించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మున్సిపాలిటీ నివేదిస్తున్న తాగునీరు, పారిశుధ్యం, చెరువులు ప్రభుత్వ స్థలాల ఆక్రమణ తదితర సమస్యలను సకాలంలో పరిష్కరిస్తామన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ పరిపాలనలో పార్వతీపురం మున్సిపాలిటీ ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. ఆ విషయాన్ని గుర్తించి రానన్న మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ ను ఆదరించాలని కోరారు. వార్డుబాట కార్యక్రమంలో భాగంగా సీనియర్ కాంగ్రెస్ లీడర్లను కలిసి పార్టీ బలోపేతానికి సహకరించాలని కోరారు.

# చికిరిని చూసే కోణం మారిపోయింది



గత ఏడాది పెద్ది నుంచి చికిరి చికిరి వీడియో సాంగ్ విడుదల చేశాక సోషల్ మీడియా ఊగిపోయింది. మిలియన్లలో వ్యూస్, లక్షల్లో రీల్స్, ఎక్కడ చూసినా దీని గురించి మాట్లాడుకునే రేంజ్ లో ఆన్ లైన్ హడావిడి మాములుగా జరగలేదు. ఒక పెద్ద హీరో సాంగ్ కి ఇంత భీభత్సమైన రెస్పాన్స్ గత కొన్నేళ్లలో ఎప్పుడూ చూడలేదన్నది వాస్తవం. ఈ ఒక్క పాటతోనే ఉత్తరాదిలోనూ పెద్దికి డిమాండ్ ఏర్పడి బిజినెస్ పరంగా మంచి రేటు పలికింది. ఇదంతా అయిపోయిన చరిత్ర.  ఇప్పుడు థియేటర్లలో రెండో వారం కొనసాగుతున్న పెద్ది నుంచి చికిరి చికిరి ఫుల్ వీడియో రిలీజ్ చేశారు. అంటే ఒరిజినల్ విజువల్స్ ని యధాతథంగా పొందుపరిచారన్న మాట. విచిత్రం ఏమిటంటే ఇప్పుడు చికిరి చికిరిని ట్రోలింగ్ కంటెంట్ గా వాడేందుకు కొన్ని యాంటీ ఫ్యాన్స్ గ్రూప్స్ సిద్ధమైపోయి పని మొదలుపెట్టేశాయి. జాన్వీ కపూర్ వెనుక రామ్ చరణ్ వెంటపడే షాట్స్ ని తెలివిగా కట్ చేసి దానికి రాక్షసుడు మ్యూజిక్ లాంటివి జోడించి వ్యూస్ తెచ్చుకుంటున్నాయి. ఇదొక్కటే కాదు కానీ రకరకాలుగా చికిరిని టార్గెట్ చేస్తున్న వైనం స్పష్టంగా కనిపిస్తోంది. ఇలా ఎందుకు జరిగిందంటే కారణం సింపుల్. పెద్దిలో జాన్వీ కపూర్ ని చూపించిన విధానం మీద ఎంత పెద్ద డిబేట్ జరిగిందో తెలిసిందే. దర్శకుడు బుచ్చిబాబు సారీ చెప్పే దాకా వ్యవహారం వెళ్ళింది. ఆమె సీన్లను ట్రిమ్ చేస్తామని కూడా వివరణ ఇచ్చారు. దాన్ని దృష్టిలో పెట్టుకునే ఇప్పుడు చికిరి చికిరిలో పెద్ది కేవలం కామంతోనే అచ్చియమ్మని ఇష్టపడ్డాడనే రీతిలో ట్రోల్స్ చేస్తున్నారు. నిజానికి మరీ అసభ్యంగా జుగుప్స కలిగేలా బుచ్చిబాబు షూట్ చేయలేదన్నది వాస్తవం. ఇటీవల సక్సెస్ మీట్ లో అనంత శ్రీరామ్ నిలదీసింది ఈ పాయింట్ మీద. వేరే సినిమాల్లో కల్ట్ బోల్డ్ అని పొగిడి పెద్ది దగ్గరికి వచ్చేటప్పటికీ నీతులు చెప్పడం పట్ల మెగా ఫ్యాన్స్ నిరసన వ్యక్తం చేశారు. ఎవరి ఉద్దేశాలు ఏమైనా చికిరి చికిరికి అప్పట్లో లభించిన ఘన స్వాగతం ఇప్పుడు రూపం మార్చుకుంది. మస్సా మస్సా లాంటి పాజిటివ్ విషయాల కన్నా ఇలాంటి నెగటివ్ అంశాలే ఎందుకు హైలైట్ అవుతాయో వేరే చెప్పాలా.




## రవితేజ సేఫ్ గేమ్ ఆడతారా



మాస్ మహారాజా రవితేజ లైనప్ అభిమానుల అంచనాలకు తగ్గట్టు చక్కగా కనిపిస్తోంది. వరస డిజాస్టర్ల సంగతి పక్కనపెడితే ఇరుముడి మీద పాజిటివ్ బజ్ ఏర్పడుతోంది. దర్శకుడు శివ నిర్వాణకు కమర్షియల్ సినిమాలు హ్యాండిల్ చేసిన అనుభవం లేకపోయినా ఇన్ సైడ్ టాక్స్, ప్రీ రిలీజ్ రిపోర్ట్స్ సానుకూలంగా ఉండటంతో బిజినెస్ ఆఫర్లు బాగున్నాయి. మైత్రి మూవీ మేకర్స్ కి ప్రాఫిటబుల్ వెంచర్ అవుతుందనే నమ్మకం ఇండస్ట్రీ వర్గాల్లో బలంగా ఉంది. దీని తర్వాత రవితేజ దర్శకుడు హసిత్ గోలికి ఒక కమిట్ మెంట్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇంకా అధికారికంగా ప్రకటించలేదు కానీ లైన్ ఓకే అయ్యిందని సమాచారం. ఫైనల్ వెర్షన్ సిద్ధమయ్యాక ప్రకటన రావొచ్చు. వీటి సంగతలా ఉంచితే తమిళ దర్శకుడు హరి చెప్పిన స్టోరీకి రవితేజ సానుకూలంగా స్పందించారనే ప్రచారం జోరుగా తిరుగుతోంది. హరి కలవడంలో ఆశ్చర్యం లేదు కానీ మాస్ రాజా చాలా క్యాలికులేటెడ్ గా ఉంటున్న నేపథ్యంలో హరి అంటే కొంచెం రిస్క్ అవుతుంది. ఎందుకంటే ఈయన గత ట్రాక్ రికార్డు ఏమంత ఆశాజనకంగా లేదు. విశాల్ తో తీసిన రత్నం రెండు భాషల్లోనూ ఫ్లాప్. అంతకు ముందు అరుణ్ విజయ్ ఏనుగు కూడా అంతంత మాత్రంగానే ఆడింది. విక్రమ్ స్వామి స్క్వేర్ పనవ్వలేదు. సింగం 3 కూడా యావరేజే. మొదటి రెండు భాగాలు సక్సెస్ కొట్టాక మళ్ళీ ఆ స్థాయి విజయం అందుకోలేదు. అలాంటప్పుడు ఇప్పుడు వేరే భాషలో హిట్ ఇస్తారని అంత గుడ్డిగా నమ్మలేం. కథ విపరీతంగా ఎగ్జైట్ చేస్తే తప్ప ఇది సాధ్యం కాదు. అయినా మన హీరోలు ఫామ్ లో లేని కోలీవుడ్ డైరెక్టర్లతో జట్టు కట్టడం అంతగా కలిసి రాలేదు. రామ్ చరణ్ గేమ్ చేంజర్, నాగ చైతన్య కస్టడీ, రామ్ ది వారియర్ అన్నీ అవే బాపతే. మరి రవితేజ రిస్క్ తీసుకుని హరికి ఓకే చెబితే మాత్రం షాక్ అవుతుంది. మాములుగా అయితే రవితేజ ఇలాంటి లెక్కలన్నీ వేసుకోరు. నెరేషన్, కాంబినేషన్ నచ్చితే గ్రీన్ సిగ్నల్ ఇస్తారు. కానీ హరిది మాత్రం ప్రస్తుతానికి ప్రచారానికి పరిమితమయ్యింది కానీ ఇంకా అధికారిక ముద్ర పడలేదు.

# కల్కి 2 కోసం ఆర్ఆర్ఆర్ సీత ?



ప్రభాస్ అభిమానులే కాదు సగటు మూవీ లవర్స్ లో కూడా విపరీతమైన అంచనాలు మోస్తున్న సినిమా కల్కి 2. ఆల్రెడీ షూటింగ్ ప్రారంభమై రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. విడుదల ఈ ఏడాది కాకపోయినా దర్శకుడు నాగ్ అశ్విన్ ఒక ప్లానింగ్ ప్రకారం పోస్ట్ ప్రొడక్షన్ కు ఎక్కువ సమయం కేటాయించడం కోసం డార్లింగ్ డేట్స్ కు అనుగుణంగా చిత్రీకరణ చేస్తున్నారు. వేరే ఆర్టిస్టులు మాత్రమే ఉండే ఎపిసోడ్స్ చాలా మటుకు తీశారని ఇన్ సైడ్ టాక్. ఇప్పుడో స్పెషల్ న్యూస్ వచ్చింది. ఒక ముఖ్యమైన పాత్ర కోసం అలియా భట్ ని సంప్రదించినట్టు తెలిసింది. ఆర్ఆర్ఆర్ లో రామ్ చరణ్ ని ప్రేమించే సీతగా ఎంట్రీ ఇచ్చిన అలియాకు ఇక్కడ మంచి రిసెప్షన్ దొరికింది. తక్కువ నిడివే అయినా రామరాజు మరదలిగా చెప్పుకోదగ్గ సన్నివేశాలు పడ్డాయి. తర్వాత టాలీవుడ్ నుంచి ఆఫర్లు వెళ్లాయి కానీ డేట్ల సమస్య వల్ల ఓకే చెప్పలేదు. అయితే నాగ్ అశ్విన్ డిజైన్ చేసిన క్యారెక్టర్ చాలా ప్రత్యేకంగా అనిపించడంతో నో చెప్పడానికి మనసు రాలేదని ముంబై వర్గాల కథనం. అఫీషియల్ గా ఏదీ ఇప్పుడప్పుడే ప్రకటించే ఉద్దేశం లో దర్శకుడు నాగ్ అశ్విన్ లేరు. సింగ్ గీతం ఈవెంట్స్ లో ఎవరైనా కల్కి 2 ప్రస్తావన తెస్తున్నా మొహమాటం లేకుండా స్కిప్ చేస్తున్నారు. ఎందుకంటే ప్రభాస్ నుంచి ముందు రెండు సినిమాలు రిలీజ్ కావాలి. ఫౌజీ డిసెంబర్ ని టార్గెట్ చేసుకోగా స్పిరిట్ మార్చికి రెడీ అవుతోంది. చెప్పిన టైంకి వస్తాయా లేవానేది పక్కనపెడితే అటెన్షన్ ముందు ఉండాల్సింది వీటి మీద. అందుకే కల్కి 2ని అతిగా హైలైట్ చేయరు. ఇదంతా బాగానే ఉంది కానీ దీపికా పదుకునే స్థానంలో ఎవరు వచ్చారనే సస్పెన్స్ ఇంకా కొనసాగుతూనే ఉంది. సాయిపల్లవి కన్ఫర్మ్ అయ్యిందని ఆ మధ్య విశ్వసనీయ వర్గాలు చెప్పాయి కానీ తర్వాత ఎలాంటి అప్డేట్ రాలేదు. నాగ్ అశ్విన్ ని అడిగినా నేరుగా సమాధానం చెప్పలేదు. రామాయణతో ప్యాన్ ఇండియా మార్కెట్ లో అడుగు పెడుతున్న సాయిపల్లవికి కల్కి 2 ఖచ్చితంగా మంచి ఛాయస్ అవుతుంది. ఇలాంటి ఇంటరెస్టింగ్ కాంబోలు కల్కి 2లో చాలా ఉన్నాయట.

## తారక్ స్థానంలోకి సూర్య?



జూనియర్ ఎన్టీఆర్ 'డ్రాగన్' తర్వాత ఏ సినిమా చేస్తాడనే విషయంలో ఎప్పట్నుంచో సస్పెన్స్ నడుస్తోంది. ముందేమో 'దేవర-2' అన్నారు. తర్వాత తమిళ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో ఓ సినిమా ఉంటుందని ప్రచారం జరిగింది. ఇంకోవైపు త్రివిక్రమ్ దర్శకత్వంలో 'గాడ్ ఆఫ్ వార్' కూడా వార్తల్లో నిలుస్తోంది. కానీ ఈ మూడు ప్రాజెక్టుల విషయంలోనూ అయోమయమే కనిపిస్తోంది. బాలయ్యతో కొత్త సినిమాకు రెడీ అవుతున్న కొరటాల శివ 'దేవర-2' విషయంలో అంత సుముఖంగా లేడని చెబుతున్నారు. 'దేవర-2' మీద నిర్మాతలకు కూడా అంత నమ్మకం లేదనే చర్చ జరుగుతోంది. మరోవైపు త్రివిక్రమ్ సినిమా సంగతి ఎటూ తేలకుండా ఉంది. ఇక నెల్సన్ మూవీ గురించి ఇప్పుడు కొత్త కబురు వినిపిస్తోంది. ఈ సినిమా నుంచి తారక్ తప్పుకున్నట్లుగా చెబుతున్నారు.



# బిజినెస్ న్యూస్




## 15 ఎయిర్‌బ్యాగ్‌లతో.. తొలి ప్లగ్ ఇన్ హైబ్రిడ్ కారు!

లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ భారత మార్కెట్లోకి తమ ప్రతిష్టాత్మక ఎస్--క్లాస్ శ్రేణిలో సరికొత్త మోడల్‌ను ప్రవేశపెట్టింది. దేశీయంగా తమ మొదటి ప్లగ్--ఇన్--హైబ్రిడ్ వాహనం (పీహెచ్ఈవీ) 'ఎస్ 450ఈ' లాంచ్ ఎడిషన్‌ను ఆవిష్కరించింది. ఈ మోడల్‌లో 2,700 కి పైగా పరికరాలను సరికొత్తగా తీర్చిదిద్దడం లేదా రివైజ్ చేయడం విశేషం. భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ దేశంలోనే మొదటిసారిగా ఈ కారులో 15 ఎయిర్‌బ్యాగ్‌లను సంస్థ ప్రవేశపెట్టింది. ఎస్ 450ఈ లాంచ్ ఎడిషన్ ధర రూ. 2.20 కోట్లుగా నిర్ణయించగా, మ్యానుఫ్యాక్చర్ ఎడిషన్ ధరను రూ. 2.38 కోట్లుగా (ఎక్స్ షోరూమ్) ఖరారు చేసింది. బుకింగ్స్ ఇప్పటికే ప్రారంభం కాగా, 2026 క్యూ4 నుంచి డెలివరీలు ఉంటాయని కంపెనీ వెల్లడించింది. ఈ లగ్జరీ కారులో 22 కేడబ్ల్యూహెచ్ లిథియం అయాన్ బ్యాటరీని అమర్చారు. ఇది కేవలం ఎలక్ట్రిక్ పవర్‌తోనే పట్టణ ప్రయాణాలకు సరిపడేలా 115 కిలోమీటర్ల వరకూ రేంజ్‌ని అందిస్తుంది. సుదీర్ఘ ప్రయాణాల్లో చార్జింగ్ అయిపోతుందనే ఆందోళన లేకుండా, అవసరాన్ని బట్టి వాడుకునేందుకు పెట్రోల్ ఇంజిన్ లభ్యతను కూడా కల్పించారు. ఈ వాహనం మొత్తం మీద 320 కిలోవాట్ (435 హెచ్‌పీ) సామర్థ్యంతో పాటు 680 ఎన్ఎమ్ గరిష్ట టార్క్‌ను ఉత్పత్తి చేస్తుంది. కేవలం 5.7 సెకన్ల వ్యవధిలోనే గంటకు 0-100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోగలదు. అలాగే ఎలక్ట్రానిక్‌గా దీని గరిష్ట వేగాన్ని గంటకు 250 కిలోమీటర్లుగా నిర్దేశించారు. ప్రీమియం కస్టమర్ల నుంచి ప్లగ్ ఇన్ హైబ్రిడ్ కార్లకు వస్తున్న భారీ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకునే ఈ ఎస్ 450ఈ మోడల్‌ను అందుబాటులోకి తెచ్చాము. కస్టమర్ల అంచనాలకు మించి, భారత్‌లో ఎస్ క్లాస్ వారసత్వాన్ని ఇది మరింత ముందుకు తీసుకెళ్తుందని ఆశిస్తున్నాము. ఈ వాహనం ద్వారా ఐసీఈ, బీఈవీ, పీహెచ్ఐవీ పవర్‌ట్రైన్ల నుంచి కస్టమర్లు తమకు అనువైన ఆప్షన్‌ను ఎంచుకునేందుకు మరింత వెసులుబాటు లభిస్తుంది" అని మెర్సిడెస్--బెంజ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు.




## 8 వేల వరకు స్మార్ట్‌ఫోన్ ధరలను పెంచిన వన్‌ప్లస్

స్మార్ట్‌ఫోన్‌ల ధరలకు రెక్కలొస్తున్నాయి. రోజురోజుకూ మరింత కాస్ట్‌లీగా మారిపోతున్నాయి. శాంసంగ్, వివో, రియల్‌మీ, ఐకూ వంటి సంస్థలు ధరల పెంపు చేపట్టగా.. తాజాగా వన్‌ప్లస్ (రాఅవూశ్రీబం) తన వన్‌ప్లస్ 15, నార్డ్ సీఈ6 లైట్ ఫోన్ల ధరలను రూ.8 వేల వరకు పెంచింది. సవరించిన ధరలు కంపెనీ వెబ్‌సైట్‌లో అమల్లోకి వచ్చాయి. ఫోన్ విడిభాగాల ధరలు పెరుగుదలే ఇందుకు కారణంగా తెలుస్తోంది. వన్‌ప్లస్ 15 స్మార్ట్‌ఫోన్ ధర 12GB + 256GB వేరియంట్ ధర రూ.77,999 నుంచి రూ.85,999కు పెరిగింది. విడుదల సమయంలో దీని ధర రూ.72,999 కావడం గమనార్హం. అదేవిధంగా 16GB + 256GB వేరియంట్ ధర రూ.85,999 నుంచి రూ.93,999కి పెరిగింది. వన్‌ప్లస్ నార్డ్ సీఈ 6 లైట్ స్మార్ట్‌ఫోన్ ధర కూడా రూ. 2-3 వేల వరకు పెరిగింది. 6GB + 128GB వేరియంట్ ధర రూ. 22,999 నుంచి రూ.25,999కి చేరింది. 8GB + 128GB వేరియంట్ ధర రూ.25,999 నుంచి 27,999, 8GB + 256GB వేరియంట్ ధర రూ. 28,999 నుంచి 30,999కు సవరించింది. వివో, లావా ధరలూ పైకి: మరో స్మార్ట్‌ఫోన్ కంపెనీ వివో (Vivo) కూడా మరోసారి తన స్మార్ట్‌ఫోన్ ధరలను రూ.4 వేల వరకు పెంచేసింది. Vivo V70, V70 Elite, Y21, Y400 సిరీస్‌పై ఈ పెంపు చేపట్టింది. అదేవిధంగా దేశీయ స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ లావా కూడా తన LAVA N1, Bold 2 స్మార్ట్‌ఫోన్ ధరలను రూ.1500 వరకు పెంచింది



## మూడో రోజూ రాణించిన స్టాక్ మార్కెట్ సూచీలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా మూడోరోజూ లాభాల్లో ముగిశాయి. అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరడంతో మన మార్కెట్‌లో కొనుగోళ్ల ఉత్సాహం కనిపించింది. ముడి చమురు ధరలు దిగి రావడం; ద్రవ్యోల్బణం, వృద్ధి భయాలు తగ్గుముఖం పట్టడమూ మార్కెట్‌కు కలిసొచ్చింది. ముఖ్యంగా ఐటీ, ఎఫ్ఎంసీజీ, రియల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ స్టాక్స్ రాణించగా.. మెటల్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. నిఫ్టీ 24 వేల మార్కుకు కాస్త దూరంలో నిలిచింది. సెన్సెక్స్ ఉదయం 76,526.77 (క్రితం ముగింపు 76,264.33) పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లో నే కొనసాగింది. ఇంట్రా డేలో 76,846.74 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 544.15 పాయింట్ల లాభంతో 76,808.48 వద్ద ముగిసింది. నిఫ్టీ 135.25 పాయింట్ల లాభంతో 23,989.15 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 94.55గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఎన్టీపీసీ, హిందుస్థాన్ యూనిలీవర్, టీసీఎస్ షేర్లు రాణించాయి. ఇండిగో, అల్ట్రాటెక్ సిమెంట్, మారుతీ సుజుకీ, టాటా స్టీల్, బీఈఎల్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 81 డాలర్లకు దిగి రాగా.. బంగారం ఔన్సు 4343 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## 6 నెలల్లో 23 కంపెనీలు.. ఇంకా 235 ఐపీఓలు వెయిటింగ్




వారానికి కనీసం ఒకట్రెండు ఐపీఓలు.. నెలలో ఒక్క కంపెనీ గురించైనా చర్చ.. బంపర్ సబ్‌స్క్రిప్షన్‌లు.. అదిరిపోయే లిస్టింగ్‌లు.. గతేడాది ఐపీఓల పరిస్థితి. ఈ ఏడాది ప్రాథమిక మార్కెట్ అందుకు భిన్నంగా నడుస్తోంది. 2026 క్యాలెండర్ సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు పూర్తి కావస్తోంది. ఇప్పటి వరకు 23 కంపెనీలు కేవలం రూ.27వేల కోట్లు మాత్రమే సమీకరించాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. స్థూల ఆర్థిక పరిస్థితులు, మార్కెట్ ఒడుదొడుకుల కారణంగా మందగమనం నెలకొంది. ఈ మేరకు ఈక్విరస్ క్యాపిటల్ మంగళవారం ఓ నివేదిక వెలువరించింది. 2025లో 103 ఐపీఓలు సందడి చేశాయి. మార్కెట్ నుంచి సంయుక్తంగా రూ.1.76 లక్షల కోట్లు సమీకరించాయి. 2024లో 90 సంస్థలు రూ.1.6 లక్షల కోట్లు, 2023లో 57 కంపెనీలు రూ.49,436 కోట్లు సమీకరించాయి. గతేడాది సెప్టెంబర్ 25న ఒక్కరోజే 25 ఇష్యూలు వచ్చాయి. 2025 క్యాలెండర్ సంవత్సరం చివరి త్రైమాసికంలో ఏకంగా 30 కంపెనీలు రూ.91,058 కోట్లు సమీకరించాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 19 కంపెనీలు రూ.24,772 కోట్లు నిధులు పొందాయి. రెండో త్రైమాసికంలో నాలుగు కంపెనీలు కేవలం రూ.2,422 కోట్లు మాత్రమే సమీకరించాయి. ముఖ్యంగా గతేడాది సెప్టెంబర్ తర్వాత మార్కెట్ పరిస్థితులు ప్రతికూలంగా మారడం, మదుపర్ల అప్రమత్తత కారణంగా ఐపీఓల సంఖ్య గణనీయంగా తగ్గుముఖం పట్టింది. అయితే, ఇప్పుడిప్పుడే పరిస్థితి మారుతోంది. ఐపీఓ కార్యకలాపాలు పుంజుకొంటున్నాయి. సీఎంఆర్ గ్రీన్ టెక్నాలజీస్, హెక్సాగాన్ న్యూట్రిషన్ వంటి కంపెనీలు జూన్ నెలలో ఐపీఓకు వచ్చాయి. భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో మరికొన్ని కంపెనీలు ఐపీఓకు సన్నద్ధమవు తున్నాయి. టర్టల్‌మెంట్ ఫిన్‌టెక్ సొల్యూషన్స్ (జూన్ 19), అద్వైత్ జువెల్స్ (జూన్ 23) సంస్థలు జూన్ నెలలో పబ్లిక్ ఇష్యూకు రానున్నాయి. వాటర్‌వేస్ లీజర్ టూరిజం కూడా ఈ నెలలోనే పబ్లిక్ ఆఫర్‌కు వస్తోంది. దేశంలోని అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ ఎన్ఎస్ఈ ఈ వారం సెబీ వద్ద తన ప్రాథమిక పత్రాలను దాఖలు చేయనుంది. క్విక్ కామర్స్ సంస్థ జెప్టో, ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్స్ వచ్చే నెలలో ఐపీఓలు తీసుకురానున్నట్లు సమాచారం. మొత్తంగా 2026 మే నాటికి 236 మెయిన్‌బోర్డ్ ఐపీఓ డ్రాఫ్ట్ పేపర్లు పైప్‌లైన్‌లో ఉన్నాయి. ఇందులో 163కి సెబీ అబ్జర్వేషన్స్ వచ్చాయి. మరో 73 కంపెనీలు ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాయని ఈక్విరస్ క్యాపిటల్ పేర్కొంది.

# ముక్కంటి సేవలో ఆస్ట్రేలియా దేశస్తులు



**శ్రీకాళహస్తి, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారం పరదేశీయులు సందడి చేశారు. సంప్రదాయ దుస్తులతో ఆస్ట్రేలియా దేశానికి చెందిన 25 మంది బృందంగా విచ్చేశారు. ముందుగా ఆలయంలో జరిగే రాహు కేతు సర్ప దోష నివారణ పూజలునిర్వహించుకున్నారు.అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.అదేవిధంగా ఆలయంలోపల వినాయక స్వామి, సుబ్రహ్మణ్య స్వామి, శని భగవానుని,ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేశారు ఈ సందర్భంగా వారు ఇక్కడి ఆలయ శిల్పకళ సౌందర్యాన్ని చూసి ఆనందం వ్యక్తం చేశారు పురాతన కాలంలో నిర్మించిన గోపురాలు ఆలయంలో స్తంభాలపై చెక్కిన శిల్పకళల లను చూసి ఆత్మానందాన్ని పొందారు వారి స్నేహితులు చెప్పడంతో ఇక్కడి ఆలయాన్ని దర్శించుకునేందుకు వచ్చినట్లు వివరించారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్-2026 వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలి

**-నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవు**

**-జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**




**తిరుపతి,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)–2026 కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు.మంగళవారం స్థానిక కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులుతో కలిసి మునిసిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఎన్నికల విభాగ అధికారులతో వర్చువల్ సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోపు ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయడం సంబంధిత అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. జిల్లాలోని కొన్ని బూత్‌లలో మ్యాపింగ్ పురోగతి ఆశించిన స్థాయిలో లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తూ, వెనుకబడి ఉన్న అధికారులు వెంటనే పనితీరు మెరుగుపరచుకోవాలని ఆదేశించారు.ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని, ఓటర్ల జాబితాలో పొరపాట్లు, డూప్లికేట్ నమోదులు లేదా అర్హత లేని పేర్లు లేకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మ్యాపింగ్, ఇంటింటి సర్వే, డేటా నవీకరణ తదితర కార్యక్రమాలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని పేర్కొన్నారు. రోజువారీ లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని తప్పనిసరిగా పూర్తి చేయాలని, నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన మరియు క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.అలాగే సమీక్షా సమావేశాలకు గైర్హాజరయ్యే అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పారదర్శకత, కచ్చితత్వం, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో తిరుపతి, సూళ్లూరుపేట రెవెన్యూ డివిజనల్ అధికారులు రామ్మోహన్, దేవేంద్రరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, రోజ్‌మాండ్, ఎన్నికల విభాగ అధికారులు, సూపర్‌వైజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నగర పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత


**-కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి**



**తిరుపతి,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మన ఇంటితోపాటు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉందని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ.సి.) శారదా దేవి అన్నారు.ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా మంగళవారం నగరంలోని ఉపాధ్యాయ నగర్, రాయల్ నగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని అన్ని వార్డుల్లో పారిశుద్య పనులు చేపడుతున్నామని తెలిపారు. ఉపాధ్యాయ నగర్ సమీపంలోనికి ఇటీవల చిరుత పులి వచ్చినట్లు స్థానికులు తెలిపారన్నారు. ఆహార వ్యర్థాలు రోడ్లపక్కన పడేయడం వలన కుక్కలు, వన్యప్రాణులు వస్తున్నాయని, వీటి కొరకు చిరుతలు వస్తున్నాయని తెలిపారు. కావున వ్యర్థాలను రోడ్లపక్కన, కాలువల్లో వేయవద్దని తెలిపారు. రాయల్ నగర్లో ప్రజలు పలు సమస్యలను వివరించారని వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. రాయల్ నగర్ లో పడిపోయేందుకు సిద్ధంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజనీర్ తులసి కుమార్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.మహేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, స్వర్ణ వార్డు కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.




## ఆంజనేయ స్వామికి విశేష పూజలు



**శ్రీకాళహస్తి, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ముక్కంటి ఆలయ ఆవరణలోని ధ్వజస్తంభం ప్రక్కన ఉన్న అచ్యుతరాయ మండపంలోని స్తంభంలో కొలువైన ఆంజనేయ స్వామికి మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ముందుగా వేద పండితులు స్వామికి పాలు పెరుగుతో అభిషేకం చేశారు. తమలపాకులతో అలంకరించి సింధూరం దిద్దారు. పూలమాలవేసి హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.

# ఏప్రిల్, మే నెలల్లో రికార్డు స్థాయిలో లగేజీ డెలివరీ సేవలు

**- అర కోటి మందికి పైగా భక్తులకు లగేజీ సురక్షితంగా అందజేత**

**- లగేజీ, సెల్ ఫోన్ల భద్రత కోసం 345 మంది సిబ్బందితో 66 కౌంటర్లలో మూడు షిఫ్టుల్లో నిరంతర సేవలు**



**తిరుమల, జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసే లక్షలాది మంది భక్తులకు సౌకర్యవంతమైన సేవలు అందించేందుకు టీటీడీ విస్తృత స్థాయిలో లగేజీ డిపాజిట్ మరియు డెలివరీ కేంద్రాలను ఏర్పాటు చేసి సమర్థవంతంగా నిర్వహిస్తోంది. భక్తులు శ్రీవారి దర్శనం, కాలినడక యాత్ర సమయంలో తమతో తీసుకువచ్చే లగేజీ, బ్యాగులు, సెల్ ఫోన్లను భద్రంగా ఉంచుకునేందుకు తిరుమలలో మరియు కాలినడక మార్గాల్లో కలిపి మొత్తం 65 కౌంటర్లు ఏర్పాటు చేసి 345 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో నిరంతరంగా సేవలందిస్తున్నారు. టీటీడీ కల్పించిన ఈ సేవలను భక్తులు పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో రికార్డు స్థాయిలో 51,38,976 మంది భక్తులు తమ లగేజీని డిపాజిట్ చేసుకున్నారు. గత ఏడాది ఏప్రిల్ లో 20,75,481 మంది భక్తులు తమ లగేజీని భద్రపరచుకోగా, ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 23,15,279 మంది భక్తులు తమ లగేజీని భద్రత పరచుకున్నారు. గత ఏడాది మే నెలలో 23,82,622 తమ లగేజీని భద్రపరచుకోగా, ఈ ఏడాది 28,23,697 మంది భక్తులు తమ లగేజీని భద్రపరచుకున్నారు. అంటే గత ఏడాది ఏప్రిల్ నెలతో పోల్చితే 2,39,798 లగేజీ డిపాజిట్లు, మే నెలతో పోల్చితే 4,41,075 లగేజీ డిపాజిట్లు అత్యధికంగా నమోదు కావడం విశేషం. అదేవిధంగా తిరుమలలో రద్దీ పెరిగిన నేపథ్యంలో గత మూడు రోజుల్లో 3,41,742 మంది ఉచిత లగేజీ సేవలు వినియోగించుకున్నారు. కాలినడక భక్తులకు ప్రత్యేక డిపాజిట్ సౌకర్యం: అలిపిరి మరియు శ్రీవారి మెట్టు కాలినడక మార్గాల ద్వారా తిరుమలకు చేరుకునే భక్తుల కోసం ప్రత్యేక డిపాజిట్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అలిపిరి కాలినడక మార్గం లగేజీ కేంద్రం వివరాలు: - ?5 కౌంటర్లు. - 45 మంది సిబ్బంది (ప్రతి షిఫ్ట్‌లో 15 మంది). - 10,194 లగేజీ డిపాజిట్ల సామర్థ్యం. శ్రీవారి మెట్టు లగేజీ కేంద్ర వివరాలు: - 2 కౌంటర్లు. - 10 మంది సిబ్బంది (ప్రతి షిఫ్ట్‌లో 5 మంది). - 3,025 లగేజీ డిపాజిట్ల సామర్థ్యం. ఈ కేంద్రాల్లో లగేజీ డిపాజిట్ చేసిన భక్తులు తిరుమలలోని డెలివరీ కేంద్రాల్లో సులభంగా తిరిగి పొందే సౌకర్యాన్ని టీటీడీ కల్పించింది. తిరుమలలో ప్రధాన డిపాజిట్ కేంద్రాలు: తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో భక్తుల కోసం లగేజీ మరియు సెల్ ఫోన్ డిపాజిట్ సౌకర్యం అందుబాటులో ఉంది. - ఫ్రీ హాల్ -- 8 కౌంటర్లు, 20 సిబ్బంది (17,291 సెల్ ఫోన్లు, 7,793 లగేజీ డిపాజిట్ల సామర్థ్యం). - వైకుంఠం క్యూకాంప్లెక్స్-- 2 కౌంటర్లు, 12 సిబ్బంది (4,270 సెల్ ఫోన్లు). - నారాయణగిరి షెడ్ -- 5 కౌంటర్లు, 45 సిబ్బంది (11,941 సెల్ ఫోన్లు, 6,749 లగేజీ డిపాజిట్ల సామర్థ్యం). - డీడీ హాల్ -- 3 కౌంటర్లు, 18 సిబ్బంది (2,526 సెల్ ఫోన్లు, 324 లగేజీ డిపాజిట్ల సామర్థ్యం). - రూ.300 హాల్ -- 4 కౌంటర్లు, 36 సిబ్బంది (6,338 సెల్ ఫోన్లు, 1,600 లగేజీ డిపాజిట్ల సామర్థ్యం). - వైకుంఠం క్యూకాంప్లెక్స్ అప్ స్కానింగ్ (కంపార్ట్‌మెంట్-03) -- 2 కౌంటర్లు, 12 సిబ్బంది. కల్యాణకట్ట సమీపంలో ప్రత్యేక డిపాజిట్ -- డెలివరీ కేంద్రాలు: తలనీలాలు సమర్పించే భక్తుల సౌకర్యార్థం కల్యాణకట్ట సమీపంలో కూడా ప్రత్యేక కేంద్రాలను టీటీడీ ఏర్పాటు చేయడం జరిగింది. ఖఖజ 1, 2, 3 -- 3 కౌంటర్లు, 18 సిబ్బంది (షిఫ్ట్-06) (688 సెల్ ఫోన్లు, 820 లగేజీ డిపాజిట్ల సామర్థ్యం). సుపథం కౌంటర్ -- 1 కౌంటర్, 6 సిబ్బంది (షిఫ్ట్-02) (1,286 సెల్ ఫోన్లు, 245 లగేజీ డిపాజిట్ల సామర్థ్యం). సీనియర్ సిటిజన్ / దివ్యాంగులు (PHC) -- 1 కౌంటర్, 2 సిబ్బంది (265 సెల్ ఫోన్లు, 75 లగేజీ డిపాజిట్ల సామర్థ్యం) వాుజ-1 మెయిన్ గేట్ (శ్రీవాణి ట్రస్ట్) -- 1 కౌంటర్, 6 సిబ్బంది (షిఫ్ట్-02) తిరుమలలో లగేజీ డెలివరీ కేంద్రాలు: డిపాజిట్ చేసిన లగేజీని తిరిగి పొందేందుకు ఈ క్రింది డెలివరీ కేంద్రాలు పనిచేస్తున్నాయి: అలిపిరి ఫుట్‌పాత్ డెలివరీ (జీఎన్సీ వద్ద) -- 5 కౌంటర్లు, 45 సిబ్బంది (ప్రతి షిఫ్ట్‌లో 15 మంది), 9,345 లగేజీ డిపాజిట్ల సామర్థ్యం. శ్రీవారి మెట్టు డెలివరీ (టీబీసీ వద్ద) -- 4 కౌంటర్లు, 12 సిబ్బంది (ప్రతి షిఫ్ట్‌లో 4 మంది), 2,482 లగేజీ డిపాజిట్ల సామర్థ్యం. PAC-4 కౌంటర్లు కౌంటర్లు 1--4: 8 కౌంటర్లు, 24 సిబ్బంది (20,477 సెల్ ఫోన్లు, 7,899 లగేజీ డిపాజిట్ల సామర్థ్యం). కౌంటర్ 07: 4 కౌంటర్లు, 12 సిబ్బంది.

కౌంటర్ 08: 4 కౌంటర్లు, 12 సిబ్బంది. కౌంటర్ 05: 4 కౌంటర్లు, 10 సిబ్బంది. లగేజీ డిపాజిట్ – డెలివరీ ప్రక్రియ: టీటీడీ లగేజీ డిపాజిట్ కేంద్రాల్లో భక్తులు తమ లగేజీని డిపాజిట్ చేసే సమయంలో సిబ్బంది ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ ద్వారా క్యూఆర్ కోడ్ జెనరేట్ చేసి బ్యాగుపై కోడ్ స్టిక్కర్ వేస్తారు. ఆ తర్వాత లగేజీకి సంబంధించిన సమాచారంతో ఒక స్లిప్ జెనరేట్ చేసి భక్తులకు అందిస్తారు. డిపాజిట్ డెలివరీ సమయంలో డెలివరీ కేంద్రంలో ఆ స్లిప్ సిబ్బందికి చూపితే ఆ నెంబర్ ఆధారంగా లగేజీని సులభంగా గుర్తించి ఒక నిమిషంలోపు లగేజీని భక్తులకు అందిస్తారు.

**భక్తులకు టీటీడీ విజ్ఞప్తి:**

తిరుమలకు విచ్చేసే భక్తులు తమ వద్ద ఉన్న లగేజీ, బ్యాగులు, సెల్ ఫోన్లను అధికారిక డిపాజిట్ కేంద్రాల్లో భద్రపరచి, టోకెన్ ఆధారంగా తిరిగి పొందాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. లక్షలాది మంది శ్రీవారి భక్తుల సౌకర్యార్థం టీటీడీ అందిస్తున్న ఈ సేవలు పూర్తిగా ఉచితం.

## పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**-కలెక్టరేట్‌లో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం**




**తిరుపతి,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఈ నెల 28,29,30 వ తేదీలలో నిర్వహించే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో విజయ వంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు.మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరం లో జిల్లా వైద్య/ఆరోగ్య శాఖాధికారి డా. బాలకృష్ణ నాయక్ తో కలిసి జిల్లాలో నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై జిల్లా జిల్లా కలెక్టర్ టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.వివిధ శాఖల అధికారులతో కలిసి పల్స్ పోలియో బ్యానర్ను మరియు పోస్టర్లను ఆవిష్కరించారు.పల్స్ పోలియో కార్యక్రమ నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలు, పోలియో బూత్‌ల ఏర్పాటు, సిబ్బంది నియామకం, అవగాహన కార్యక్రమాలు, వ్యాక్సిన్ నిల్వలు, రవాణా ఏర్పాట్లు, పర్యవేక్షణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జాతీయ పల్స్ పోలియో దినోత్సవం సందర్భంగా 0 నుండి 5 సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి రెండు పోలియో చుక్కలు వేయాలని తెలిపారు. అర్బన్ ప్రాంతంలో , పర్యాటక ప్రదేశాలలో పిల్లలు పోలియో చుక్కలు వేయించుకోకుండా మిస్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని అలాంటి వారిపై దృష్టి సారించి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పోలియో బూత్‌లతో పాటు బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లలో ప్రత్యేక మొబైల్ వ్యాక్సినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల ద్వారా అర్హులైన చిన్నారులను గుర్తించి వారికి పోలియో చుక్కలు వేయించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పల్స్ పోలియో చుక్కలు అందించేందుకు సంబంధిత శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని, పోలియో చుక్కల కార్యక్రమం 100 శాతం విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. జిల్లా వైద్య/ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ.. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 1937 పల్స్ పోలియో కేంద్రాలు, 84 మొబైల్ కేంద్రాలు, 57 ట్రాన్సిట్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, జిల్లా వ్యాప్తంగా 2,59,843 మంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. హైరిస్క్ ప్రదేశాలైన గుడారాలు, ఇటుక బట్టీలు, నిర్మాణ ప్రదేశాలు వంటి చోట్ల మొబైల్ సిబ్బంది పర్యటించి ఐదు సంవత్సరాలలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శాంతకుమారి, డి సి హెచ్ఎస్ ఆనందమూర్తి, జిల్లా విద్యాశాఖ అధికారి కె వి ఎన్ కుమార్, ఐసిడిఎస్ పిడి వసంతబాయి ప్రోగ్రామ్ ఆఫీసర్లు, మున్సిపల్ ఆఫీసర్లు, డి ఆర్ డి ఏ అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ ప్రాజెక్టుల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

**-జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్**



**తిరుపతి,జూన్ 16 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రైల్వే ప్రాజెక్ట్ పనులు,శ్రీ సిటీ ఫేస్ -2, ఎల్ జి ఫేస్-2, కొల్లాడం, ఇరుగుళం, పెద్దేటిపాకం, రాళ్లకుప్పం, స్పేస్ సిటీ ఫేస్ 1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, జాతీయ రహదారులు, వైజాగ్ చెన్నై కారిడార్పైపు లైన్ పనులు,ఏ డీబి రోడ్డులు, దుగ్గరాజపట్నం పనులు, కృష్ణపట్నం పోర్ట్, రైల్వే ప్రాజెక్ట్ పనులు, ఏపీఐఐసీ సంబంధించి శ్రీ సిటీలోని ఎల్జి కంపెనీకి సంబంధించి పలు భూ సంబంధిత పెండింగ్ నిర్మాణ పనులపై కలెక్టర్ వెంకటేశ్వర్ జాయింట్ కలెక్టర్ ఆర్. గోవింద రావు తో కలసి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.రైల్వే,రహదారులు తదితర జాతీయ ప్రాజక్టులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ,నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేసించారు.వర్చువల్ విధానంలో నిర్వహించిన ఈ సమావేశంలో తిరుపతి, నెల్లూరు , చెన్నై నేషనల్ హైవే పి డి లు, రైల్వే ప్రాజెక్టు అధికారి, సదరన్ రైల్వే అధికారి, తిరుపతి,నెల్లూరు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎల్. శివకుమార్, టి టి డి ఎస్టేట్ అధికారి, ఎస్ ఈ ఇరిగేషన్ ,ఆర్ అండ్ బి ఎస్ ఈ,రాజా నాయక్,పంచాయతీ రాజ్, ఆర్డబ్ల్యూఎస్, విద్యుత్ శాఖ అధికారి, ఏపీఐఐసీ అధికారులు, సంబంధిత మండలాల తహసీల్దార్లు, కాంట్రాక్టర్లు,తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... శ్రీ సిటీ ఫేజ్ -2, ఏ పి ఐ ఐ సి లోని ఎల్ జి ఫేజ్ -1,2, 3 కొల్లాడం, ఇరుగుళం,పెద్దేటిపాకం,రాళ్లకుప్పం, శ్రీ సిటీ ఫేజ్ -1, 2,3,4, నాయుడుపేట ఫేస్ 2, వానెల్లూరు, పాగలి, , ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ భూసేకరణ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ప్రాజెక్టు లకు సంబందించిన పెండింగ్ కోర్టు కేసులను కూడా త్వరగా పరిస్కారం అయ్యేలా చూడాలన్నారు. వెబ్ ల్యాండ్ పై వున్న సమస్యలను సత్వరమే పరిస్కారం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి జిల్లాలో జాతీయ రహదారుల అభివృద్ధి కి సంబంధించి వి సి ఐ సి రోడ్డు, ఏ పి ఐ ఐ సి ప్రాజెక్ట్స్,వైజాగ్ చెన్నై కారిడార్ పైపు లైను పనులు, రైల్వే ప్రాజెక్ట్స్ పనులు పురోగతిలో ఉన్న పనులపై నడికుడి - శ్రీకాళహస్తి, ఏర్పేడు - పూడి, గుమ్మిడి పూండి-గూడూరు, గూడూరు-రేణిగుంట, తిరుపతి - కాట్పడి అర్కోణం - రేణిగుంట, సంబంధించిన రైల్వే ప్రాజెక్టు పనులను, దుగ్గరాజపట్నం, వేగవంతం చేయాలన్నారు.నాయుడుపేట-రేణిగుంట, , రేణిగుంట-కడప రేణిగుంట నుండి చెన్నై రహదారుల పనులు పూర్తి చేయాలని భూ సేకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ప్యాకేజీ 2,3,4 జాతీయ రహదారి పనులు సాగరమాల కింద చేపట్టిన వాటిని పెండింగ్ లేకుండా రెవెన్యూ డివిజనల్ అధికారులు నేషనల్ హైవే అధికారులతో సమన్వయంతో చేసుకొని నాణ్యత తో పనులు పూర్తి కావాలని అన్నారు.ఎయిర్పోర్ట్, ఇస్సేర్, కరకంబాడి, ఎమ్ ఐ జి లే అవుట్ తిమ్మాజికండ్రిగ, పెండింగ్ భూ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆర్డీఓలను ఆదేశించారు.వడమాల పేట, ఏర్పేడు మండలాలలో పాదిరేడు అరణ్యం, పల్లం గ్రామాల నందు టీటీడీ ఉద్యోగస్తులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై కూడా త్వరిత గతిన చర్యలు తీసుకొని పూర్తి చేయాలన్నారు.ఈ సమావేశంలో తిరుపతి జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, సూళ్లూరుపేట ఆర్డీఓలు, రామ్మోహన్, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, రోజ్ మాండ్, ల్యాండ్ అండ్ సర్వే రికార్డ్స్ అధికారి రాంప్రసాద్ సిటీ జనరల్ మేనేజర్ భగవాన్,సంబంధిత తహసీల్దార్లు, డెప్యూటీ తహసీల్దార్లు , సెక్షన్ అధికారులు భాస్కర్, చైతన్య, శివప్రసాద్, భూసేకరణ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027